

ఉయ్యాల్లో బాలా త్రిపుర సుందరి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజైన మంగళవారం జిల్లాలోని పలు ఆలయాల్లో అమ్మవార్లు వివిధ అలంకరణల్లో భక్తులకు అభయమిచ్చారు. కాకినాడ రామారావుపేటలోని బాలాత్రిపురసుందరి ఆలయంలో అమ్మవారు ఉయ్యాలలో ఇలా దర్శనమిచ్చారు.



రోడ్డెక్కిన మత్స్యకారులు

- డిమాండ్లను పరిష్కరించాలని ఉప్పాడ బీచ్‌రోడ్డులో ఆందోళన
- రసాయన పరిశ్రమలపై ఆగ్రహం

7

తప్పుడు సర్టిఫికెట్‌తో డీఎస్సీలో ఉద్యోగం

- ధృవపత్రాల తనిఖీలో దొరికిపోయిన ఉద్యోగం పొందిన కానిస్టేబుల్
- నియామకాన్ని రద్దు చేసిన జిల్లా విద్యాశాఖ
- విచారణకు ఆదేశించిన పోలీస్‌శాఖ

7

సాగుకు.. సౌరభం!



వ్యవసాయానికి సోలార్ విద్యుత్

- రైతులకు తీరనున్న సమస్య
- పగలు 9 గంటలు సరఫరా
- రెండు జిల్లాల్లో ప్లాంట్ల ఏర్పాటు
- రూ.162 కోట్లతో 12 ప్రాజెక్టులు
- ఏడాదిలోపు పూర్తికి ఒప్పందం
- ఉత్పత్తయ్యే విద్యుత్ గ్రిడ్‌కు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సాగుకు సోలార్ విద్యుత్ రాబోతోంది. ఇకపై పగటిపూటే తొమ్మిది గంటలపాటు విద్యుత్‌ను అన్నదాతలు వినియోగించుకోవచ్చు. తద్వారా వ్యవసాయానికి విద్యుత్ బెంగ తీరబోతోంది. ఈ మేరకు ట్రాన్స్‌కో రూ.162 కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్లను నిర్మించడానికి అడుగులు వేసింది. దీని ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను కేవలం పగటిపూట రైతులు వాడుకునేందుకు మాత్రమే సరఫరా చేయనుంది. తద్వారా రైతులు విద్యుత్ కోసం రాత్రి వేళల్లో పడిగాపులు కాసే పరిస్థితులు తప్పనున్నాయి. కాకినాడ జిల్లాలో పోలవరం కాలువ వెంబడి మురారీ నుంచి తేటగుంట వరకు 11 చోట్ల, రాజమహేంద్రవరం జేగురుపాడులో 30 ఎకరాల్లో మరోచోట ఈ భారీ సోలార్ పవర్ ప్లాంట్లు రాబోతున్నాయి. పీఎం కుసుమ్ కింద వీటి నిర్మాణ పనులను తాజాగా పేరాడిమ్ టెక్నాలజీ, నోవల్ లాజిటెక్ సంస్థలు దక్కించుకున్నాయి. ఏడాదిలోగా ప్లాంట్ల నిర్మాణం పూర్తి చేయనున్నాయి. కాకినాడ జిల్లాలో 11 ప్రాజెక్టులకు రూ.150 కోట్లు, జేగురుపాడు సోలార్ ప్లాంట్‌కు రూ.12 కోట్లు ఖర్చుకానుంది. సోలార్ పవర్ ప్లాంట్లను దక్కించుకున్న సంస్థలు ఇటీవల స్థల పరిశీలన పూర్తి చేశాయి.

ఇక బెంగ తీరినట్లే...

వ్యవసాయాధారిత జిల్లా ఉమ్మడి తూర్పుగోదావరి. వరి, వాణిజ్య పంటల ఉత్పత్తిలో రాష్ట్రంలోనే మంచి ప్రగతి సాధిస్తున్నారు. అయితే వీరిలో విద్యుత్ మోటార్లపై ఆధారపడి సాగు చేస్తోన్న వారి సంఖ్య అధికమే. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ కనెక్షన్లు 70 వేల వరకు ఉన్నాయి. వీటిలో సాగుకు పక్కాగా తరచూ విద్యుత్ వినియోగిస్తోన్న కనెక్షన్లు 51 వేలు ఉన్నాయి. ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తోంది. 49 వేల మంది రైతులు వినియోగించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాకు 3.10 లక్షల కిలోవాట్స్ లోడ్ అవసరం అవుతోంది. అంటే 500 మిలియన్ యూనిట్లపైనే. ఈ మొత్తం విద్యుత్‌ను అన్నదాతలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నందుకు ఏటా రూ.300 కోట్ల వరకు ఆర్థిక భారం పడుతోంది. లోడ్ అంతరాయాలు లేకుండా ఇప్పటికే మూడు ఈహెచ్‌టీ విద్యుత్ ఉప కేంద్రాల్లో రూ.148 కోట్లతో 33 కేవీ ఫీడర్లు ఏర్పాటు చేశారు. ఇందులో రూ.38.41 కోట్లతో 25 పవర్ ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యం పెంచారు. మరో 19 అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేశారు. ఇంత చేసినా తీవ్ర వేసవి సమయంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించడం కష్టం అవుతోంది. దీంతో వ్యవసాయ విద్యుత్ సరఫరాలో కోతలు విధించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. దీంతో అత్యవసర సమయంలో నీరందరక పంటలు ఎండి అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇకపై సాగుకు విద్యుత్ సమస్య ఉత్పన్నం కాకూడదనే లక్ష్యంలో భాగంగా పీఎం కుసుమ్ ప్రాజెక్టు కింద ట్రాన్స్‌కో అధికారులు సోలార్ విద్యుత్‌పై దృష్టిసారించారు.

సోలార్ ప్లాంట్లు ఏర్పాటు

పీఎం కుసుం పథకం కింద పగటి పూట తొమ్మిది గంటలు సోలార్ విద్యుత్ సరఫరా చేయడానికి కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో 12 చోట్ల సోలార్ పవర్‌ప్లాంట్లను నిర్మించాలని నిర్ణయించారు. వీటి నిర్మాణం పూర్తయ్యాక ఉత్పత్తయ్యే విద్యుత్‌కు గ్రిడ్‌ను అనుసంధానించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయ విద్యుత్‌కు మాత్రమే సరఫరా చేయనున్నారు. ప్రధానంగా కాకినాడ జిల్లాలో రూ.150 కోట్లతో 11 చోట్ల వీటిని నిర్మించనున్నారు. స్థల సమస్య ఉండడంతో పోలవరం కాలువ వెంబడి నిర్మిస్తున్నారు. జగ్గంపేట నియోజవర్గం గండేపల్లి మండలం మురారీ నుంచి తుని నియోజకవర్గం తేటగుంట వరకు కాలువ వెంబడి సోలార్ పవర్ ప్లాంట్లు రానున్నాయి. గండేపల్లి మండలం బొర్రంపాలెంలో 16 ఎకరాల్లో, ఉప్పలపాడులో 11, గండేపల్లిలో 23, మురారి 8, నాయంకపల్లి 10.40 ఎకరాలు, జగ్గంపేటలో 25.73, ప్రత్తిపాడులో 16, అన్నవరం 17.36, కత్తిపూడి 11.49, తుని రూరల్ తేటగుంటలో 1.79, తుని చామరవరంలో 24.07 ఎకరాల్లో మొత్తం 173.65 ఎకరాల్లో సోలార్ పవర్‌ప్లాంట్లు రాబోతున్నాయి. మొత్తం కాలువ వెంబడి స్థలాల్లో ఐదు నుంచి పదెకరాల వరకు ఉన్న చోట్ల 8 మెగావాట్ల వరకు, తక్కువ స్థలం ఉన్నచోట్ల రెండు నుంచి నాలుగు మెగావాట్ల వరకు సోలార్ పవర్ ప్లాంట్లను స్థాపించనున్నారు. మొత్తం అన్నీ కలిపి 173.65 ఎకరాల్లో 40 మెగావాట్ల సామర్థ్యంతో కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో ఇవి రాబోతున్నాయి.

కోనసీమలో మాత్రం..

వీటికి ఇటీవల టెండర్లు పిలిచారు. కాకినాడ జిల్లాలో ప్లాంట్ల నిర్మాణ పనులను పేరాడిమ్ టెక్నాలజీ సంస్థ దక్కించుకోగా, తాజాగా కంపెనీ ప్రతినిధులు అన్ని స్థలాలను పరిశీలించి వెళ్లారు. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రాజ మహేంద్రవరం సమీపంలోని జేగురుపాడులో 30 ఎకరాలు గుర్తించారు. ఇక్కడ 9.5 మెగా వాట్ల సామర్థ్యంతో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మించనున్నారు. ఈ పనులను నోవల్‌లాజిటెక్ సంస్థ దక్కించుకుంది. ఇందుకు రూ.12 కోట్ల వరకు ఖర్చు కానుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రెండుచోట్ల సోలార్ ప్లాంట్లను నిర్మించడానికి ప్రయత్నించినా స్థల సమస్యతోపాటు ఎక్కడికక్కడ చెట్లు అడ్డు తగులుతుండడంతో సోలార్ విద్యుత్‌కు సరిపడా ఎండ లభించదనే నిర్ణయానికి ప్రస్తుతం వచ్చారు.

టైల్స్ వేస్తున్నారంట..

- జోరుగా టిడ్కో గృహాల నిర్మాణపనులు
- డిసెంబర్ నాటికి పూర్తి చేసేలా చర్యలు
- గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిలిచిన గృహాలు
- కూటమి ప్రభుత్వంలో చకచకా పనులు



కాకినాడలోని టిడ్కో గృహాల్లో సాగుతున్న ఫ్లోరింగ్ పనులు

టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లపై గత వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. గూడు కోసం ఎదురుచూస్తున్న వారి గోడును పట్టించుకోవడం మానేసింది. చిన్నచిన్న పనులను సైతం చేపట్టకుండా ఐదేళ్ల పాటు కాలయాపన చేసింది. కేవలం రంగులు మార్చి తామే నిర్మించినట్టుగా ఏమార్చే ప్రయత్నం చేసింది. ఇంటి కోసం కొండంతో ఆశతో ఎదురుచూస్తున్న వారి ఆశలపై నీళ్లు చల్లింది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించింది. పెండింగ్ పనులన్నీ వెంటనే పూర్తయ్యేలా చకచకా చేపడుతున్నారు.

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

పేద, మధ్యతరగతి వర్గాలకు సొంతింటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో కాకినాడ జిల్లాలోని కాకినాడ, సామర్లకోట, పెద్దాపురం, పిఠాపురం మున్సిపాలిటీల పరిధిలో చేపట్టిన టిడ్కో గృహాల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది చివరినాటికి మొత్తం పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసేలా పనులు ముమ్మరం చేశారు. కాకినాడ జిల్లాలో మొత్తం 9926 టిడ్కో గృహాలు మంజూరయ్యాయి. దానిలో పూర్తి చేసినవి 7288 నిర్మిస్తున్నారు. వీటిలో 904 మాత్రమే కాకినాడలో జరుగుతున్నాయి. అలాగే జిల్లాలోని పెద్దాపురంలో 3312, పిఠాపురంలో 864, సామర్లకోటలో 1056 టిడ్కో ఇళ్లు నిర్మించారు. కాకినాడ నగరంలో 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో 3136 టిడ్కో ఇళ్లు మంజూరయ్యాయి. వాటిలో 2056 ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టారు. ఇందులో టీడీపీ హయాంలో 1152 గృహాలు పూర్తయ్యాయి. వీటిలో కొన్ని టీడీపీ అందించగా, వైసీపీ ప్రభుత్వం వచ్చాక కొన్నింటిని లబ్ధిదారులకు అందజేసింది. మిగిలిన 904 ఇళ్ల నిర్మాణాలను పట్టించుకోవడం మానేసింది. డబ్బులు ముందుగానే చెల్లించిన లబ్ధిదారులు తమ సొంతింటి కల నెరవేర్చుకునేందుకు ఎదురుచూశారు. గత టీడీపీ ప్రభుత్వంలో పూర్తయిన గృహాలకు ఆ తర్వాత వచ్చిన వైసీపీ.. రంగులు మార్చుకున్నారే తప్ప, ఆ గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు ఏ మాత్రం చొరవచూపలేదు. కనీసం తాగునీరు, ఫ్లోరింగ్, డ్రెయిన్లు, రోడ్లు, స్ట్రీట్‌లైట్లు వంటి వాటిపై దృష్టిసారించలేదు. పైగా పూర్తయిన ఇళ్లను తమ అనుకూల వర్గీయులకు కేటాయించుకున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతంలో తమ ప్రభుత్వ హయాంలో చేపట్టిన గృహ నిర్మాణాలపై దృష్టిసారించింది. ఏయే పనులు ఇంకా చేపట్టాలనే విషయంపై జాబితా సిద్ధంచేసింది. ఈ మేరకు కాకినాడలో అసంపూర్తిగా మిగిలిపోయిన 904 టిడ్కో గృహాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టింది. ఇళ్ల ఫ్లోరింగ్, టైల్స్, మరుగుదొడ్ల నిర్మాణం వంటి పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది చివరినాటికి పూర్తయ్యేలా చూస్తామని టిడ్కో డీఈ పి.గంగరాజు, ఏఈ మోహన్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కాగా వచ్చే ఏడాది జనవరి పండగల సమయంలో లబ్ధిదారులకు అప్పగించేలా చర్యలు చేపడుతున్నారు.

రేపు బెజవాడకు కొత్త టీచర్లు

- 3315 మంది ఎంపిక
- నేడు రాజమండ్రిలో రిజిస్ట్రేషన్
- 5 పాఠశాలల్లో వసతి
- 72 ఆర్టీసీ బస్‌లు ఏర్పాటు
- ఇక్కడి నుంచే విజయవాడ

రాజమహేంద్రవరం/ అర్బన్/ కాకినాడ కార్పొరేషన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025లో విజయం సాధించిన 3315 మంది ఉపాధ్యాయ అభ్యర్థులను రాజమహేంద్రవరం నుంచి ఈనెల 25న విజయవాడలో జరిగే సభకు తీసుకెళ్లనున్నారు. తూర్పుగోదావరి జిల్లాతోపాటు కాకినాడ, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ఎంపికైన కొత్త టీచర్లను 72 బస్సుల్లో తరలిస్తారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే ఈ సభలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. సీఎం చేతుల మీదుగా కొత్త టీచర్లకు నియామకపత్రాలు అందజేస్తారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి 50 బస్సులు, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి 10 బస్సులు, కాకినాడ నుంచి 12 బస్‌లు బుధవారం సాయంత్రం రాజమహేంద్రవరం చేరుకుంటాయి. ఇక్కడి నుంచే గురువారం ఉదయం విజయవాడ వెళతాయి. ఇప్పటికే స్త్రీ శక్తి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకానికి బస్సులను పంపడంలో ఆర్టీసీ అధికారులు తలమునకలై ఉన్నారు. విజయవాడ సభకు బస్సులు కేటాయించాల్సి రావడం ఆర్టీసీ అధికారులకు కత్తిమీద సాములా మారనుంది.

నేడు పేర్ల రిజిస్ట్రేషన్..

విజయవాడ వెళ్లే ఉపాధ్యాయ అభ్యర్థులకు కొన్ని ఎంపిక చేసిన స్కూళ్ల వద్ద రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఏర్పాట్లు చేశారు. ఈ స్కూళ్ల వద్దనేవీరంతా బస్సులు ఎక్కాల్సి ఉంటుంది. రాజమహేంద్రవరం శ్రీరామనగర్‌లోని బీవీఎం ఉన్నతపాఠశాల, మోరంపూడిలోని శ్రీచైతన్య ఉన్నతపాఠశాల, లాలాచెరువు మునిసిపల్ ఉన్నతపాఠశాల, శంభూనగర్ ఫ్లైఓవర్ కింద బాలాజీ పేట సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల, బొమ్మూరు ప్రభుత్వ డైట్ కళాశాల దగ్గర డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలను కేటాయించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వారు ఒక సహాయకుడు /సహాయకురాలితో కలిసి బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు వారికి కేటాయించిన పాఠశాలల వద్ద రిజిస్ట్రేషను నిమిత్తం హాజరుకావాలని ఆదేశించారు. అభ్యర్థులు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్, కాల్ లెటర్, దుప్పటి, తలగడ, గొడుగు తెచ్చుకోవాలని సూచించారు. అదేవిధంగా 24న వసతి, రాత్రి భోజనం, 25న ఉదయం అల్పాహారం, విజయవాడకు బస్సు సదుపాయం కల్పించామన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టుల భర్తీకి సన్నాహాలు

కాకినాడ జిల్లాలో 80 పోస్టులు.. త్వరలో నోటిఫికేషన్

సామర్లకోట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవల కాకినాడ జిల్లాలో 9 ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో మినీ నుంచి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా 59 అప్‌గ్రేడ్ అయిన విషయం విధితమే. దీంతో పాటు కాకినాడ జిల్లాలో పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పదవీ విరమణ చెందిన వారు, మృతిచెందిన వారు, రాజీనామాలు చేసిన వారు సుమారు 21 మంది వరకూ ఉన్నారు. దీంతో మొత్తం 80 కేంద్రాల్లో సహాయకుల(హెల్పర్ల) పోస్టుల భర్తీకి పచ్చజెండా ఊపింది. ఈ మేరకు వెంటనే నియామక ప్రక్రియను ప్రారంభించాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల నుంచి జిల్లా మహిళా, శిశు సంక్షేమ కార్యాలయాల పీడీలకు ఆదేశాలను శనివారం ప్రభుత్వం జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 4,687 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిస్థాయి కేంద్రాలుగా ప్రభుత్వం ఇటీవల మార్చిన విషయం విధితమే. ఈ కేంద్రాల్లో సేవలను మరింత మెరుగుపరిచేందుకు, కార్యకర్తలపై పనిభారాన్ని తగ్గించేందుకు ప్రతీ అంగన్‌వాడీకేంద్రానికి ఒక సహాయకురాలిని నియమించాలని నిర్ణయించింది.కాకినాడ జిల్లాకు చెంది కొత్తగా 80 సహాయకుల పోస్టులను మంజూరు చేస్తూ అనుమతులిచ్చినట్టు సమాచారం. వీటిని భర్తీ చేసేందుకు నియామకాలకు పదోతరగతి విద్యార్హతగా నిర్ణయించే అవకాశం ఉంది. మరో వైపు అప్‌గ్రేడ్ అయిన కేంద్రాల్లో పనిచేస్తున్న మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. పదో తరగతి ఉత్తీర్ణులైన 59 మంది మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తలుగా ప్రభుత్వం గుర్తించి వారి గౌరవవేతనాన్ని నెలకు రూ.11,500లకు పెంచింది. తాజాగా సహాయకుల నియామకాలకు అనుమతులు ఇవ్వడంతో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మరింత మెరుగుపడనుందని మహిళా, శిశు సంక్షేమ అధికారులు భావిస్తున్నారు. వచ్చే వారం రోజుల్లోపు నియామకాలకు సంబంధించిన ప్రకటన విడుదల చేసేందుకు ఆ శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ఉపాధి బిల్లులు రూ.43 కోట్లు పెండింగ్

డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో రూ.43 కోట్ల ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి తెలిపారు. కాకినాడలో మంగళవారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరామన్నారు. జిల్లాలో మొత్తం రూ.126 కోట్ల ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ పనులు చేపట్టగా ఇప్పటి వరకు రూ.83 కోట్లు మేరకు బిల్లులు చెల్లించారన్నారు. మిగిలిన రూ.43 కోట్ల బిల్లుల విడుదలలో కొంత జాప్యం చోటుచేసుకుందన్నారు. కూలీలకు రూ.2 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బ్యాంకు ఖాతాల్లో ఇబ్బందుల వల్ల ఉపాధి కూలీలకు సంబంధించి 1,378 లావాదేవీలు నిలిచిపోయాయన్నారు. దీంతో కూలీల బ్యాంకు ఖాతాలకు రూ.15 లక్షలు జమ కాలేదన్నారు. దీనిని పరిష్కరించాలని బ్యాంకర్లను కోరామన్నారు. జిల్లాలో జగ్గంపేట, గండేపల్లి, కోటనందూరు, తుని మండలాల్లో నాలుగు గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి మ్యాజిక్ డ్రైన్లు నిర్మిస్తామన్నారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో రెండు వేల పశువుల షెడ్లు నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించామన్నారు. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.1.15 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు కేటాయిస్తామన్నారు. జాబ్ కార్డులున్న రైతులు వినియోగించుకోవాలని చెప్పారు.

'పునరావాసం కల్పించాలని డిమాండ్'

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలవరం ఎడమ కాలువ నిర్మాణంలో నిర్వాసితులైన తమకు పునరావాసం కల్పించాలని తుని మండలం కుమ్మరి లోవ గ్రామస్తులు కొందరు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కుమ్మరిలోవలో కొంత మందికి పునరావాసం కల్పించి మిగిలిన వారికి న్యాయం చేయలేదని ఆరోపించారు. కలెక్టర్ చొరవ చూపి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఎన్నో ఏళ్లుగా నివాసం ఉన్న తమకు కూడా పునరావాసం కల్పించాలని కోరుతున్నామన్నారు. అనంతరం డీఆర్‌వో వెంకట్రావుకు వినతిపత్రం ఇచ్చారు. సత్యనారాయణరాజు, సుధాకల్యాణి, సుకన్య, లక్ష్మి, వేణు, యమున తదితరులు పాల్గొన్నారు.





తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం మోరంపూడి కూడలిలోని ఓ భవనంపై ఏర్పాటు చేసిన హోర్డింగ్

జర భద్రం

ట్రాఫిక్ రూల్స్ పాటించు.. జాగ్రత్తగా ఇంటికి వెళ్తావు

జాతీయ రహదారులపై ఆలోచింప చేస్తున్న సందేశాత్మక హోర్డింగులు

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

జర భద్రం... రహదారులపై ప్రయాణించే సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ జాతీయ రహదారుల వెంబడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పోలీసు శాఖ ఏర్పాటుచేసిన సందేశాత్మక హోర్డింగులు అందరినీ ఆలోచింపచేస్తున్నాయి.

కాకినాడ జిల్లా కత్తిపూడి నుంచి తిమ్మాపురం వరకు గత 216 జాతీయ రహదారి, తుని నుంచి రావులపాలెం, దివాన్‌చెరువు వరకు గల జాతీయ రహదారి వెంబడి పలు ముఖ్యమైన కూడళ్లు, ప్రాంతాల్లో హోర్డింగులు పెట్టారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ వీటిని ఏర్పాటు చేయడంతో పాటు వాహనచోదకులకు జాగ్రత్తలు సూచించారు. ప్రతి హోర్డింగుపై 'బాగుంటావ్, ట్రాఫిక్ రూల్స్ పాటించు జాగ్రత్తగా ఇంటికి వెళ్తావు' అని ఉంది. అదే సమయంలో ఒక్కో బోర్డుపై ఒక్కో సందేశాన్ని ఇచ్చారు.

హెల్మెట్ పెట్టుకో బాగుంటావ్ అంటూ హెల్మెట్ ధరించిన వ్యక్తి ఫొటో, ప్రమాదానికి గురైన వ్యక్తి ఫొటోను ఒక హోర్డింగులో ప్రదర్శించారు.

డ్రైవింగ్ చేస్తూ ఫోను మాట్లాడకు... బాగుంటావ్ అంటూ తూర్పు గోదావరి జిల్లాలో జాతీయ రహదారిపై డ్రైవ్ చేస్తున్న వ్యక్తి ఫోను మాట్లాడుతూ జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొట్టి నిలువునా నిలుచున్న కారు ఫొటోను మరో హోర్డింగ్‌లో ప్రదర్శించారు. ఇతర ప్రాంతాల్లో ఇటువంటి వాటినే ఏర్పాటు చేశారు. ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ పెట్టిన ఈ హోర్డింగులు వాహన చోదకులను ఆకట్టుకుంటున్నాయి.



కాకినాడ జిల్లా గొల్లప్రోలు బైపాస్ కూడలి వద్ద ఏర్పాటుచేసిన హెల్మెట్ పెట్టుకో బాగుంటావ్ హోర్డింగ్

జేఎన్టీయూకేలో 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్'

జేఎన్టీయూకే, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకేలోని యూసీఈకేలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2025 అంతర్గత మూల్యాంకన మంగళవారం జరిగింది. దీనిని ప్రిన్సిపాల్ మోహన్‌రావు ప్రారంభించగా కరుణ సమన్వయకర్తగా వ్యవహరించారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ అనేది దేశవ్యాప్తంగా విద్యా మంత్రిత్వ శాఖ నిర్వహించే కార్యక్రమమని ప్రిన్సిపాల్ తెలిపారు. బెంగళూరుకు చెందిన క్రిఫీ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ ఎండీ కె.కృష్ణారెడ్డి, సీఎస్ఈ ప్రొఫెసర్ ఎల్.సుమలత, మెకానికల్ ఇంజనీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌కిషోర్ జ్యూరీ సభ్యులుగా వ్యవహరించారు.మొత్తం 34 బృందాలు హాజరుకాగా ఎంపికైన బృందాలు జాతీయ స్థాయి స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో యూసీఈకే తరపున పాల్గొంటాయని ప్రిన్సిపాల్ చెప్పారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎస్ఎస్ఎస్ వలంటీర్ల ఎంపికలు



వలంటీర్ల ఎంపిక నిర్వహిస్తున్న దృశ్యం

జేఎన్టీయూకే, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ పరేడ్ క్యాంప్‌లో పాల్గొనే ఉత్తమ ఎస్ఎస్ఎస్ వలంటీర్లను ఎంపిక చేసేందుకు కాకినాడ జేఎన్టీయూ ఇండోర్ మైదానంలో మంగళవారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు.ఎంపికలను హైదరాబాద్ ప్రాంతీయ డైరెక్టరేట్, ఎస్ఎస్ఎస్ సెల్, వర్శిటీ నిర్వహించాయి. ప్రాంతీయ డైరెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ఎస్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయ సమైక్యతకు ప్రతీకలన్నారు. సమన్వయకర్త జి.శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ రిపబ్లిక్ డే పరేడ్‌లో చోటుదక్కడం ప్రతి విద్యార్థికీ గొప్ప గౌరవమన్నారు.ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికైన వలంటీర్లు ఢిల్లీలో జరిగే పరేడ్‌లో జేఎన్టీయూకే తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ప్రాంతీయ డైరెక్టరేట్ ప్రతినిధి సం జయ్, ఎస్ఎస్ఎస్ అధికారులు ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించారు.

జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీలో కుర్రాళ్ల ప్రతిభ



రన్నర్స్‌గా నిలిచిన ఆంధ్ర క్రీడాకారులు

సామర్లకోట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హర్యానా రాష్ట్రం పంచకులాలో ఈ నెల 13 నుంచి 22 వరకు జరిగిన యొనెక్స్ సన్‌రైజ్ అశ్వినిగుప్తా మెమోరియల్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో డబుల్స్ విభాగంలో కాకినాడ జిల్లా సామర్లకోట మండలం అచ్చంపేటకు చెందిన వీరంరెడ్డి హరికృష్ణ, చిత్తూరు జిల్లాకు చెందిన తిప్పన చరణ్‌రామ్ సత్తా చాటారు. చైనాలో వచ్చే నెలలో జరిగే ఆసియన్ గేమ్స్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. మంగళవారం సాయంత్రం స్వగ్రామానికి చేరుకున్న హరికృష్ణకు సర్పంచ్ వీరంరెడ్డి చినబాబు, వీరం రెడ్డి పెదబాబు, సలాది బ్రహ్మానందరావు(రమేష్), వీరం రెడ్డి నాని పూలమాలలు వేసి సత్కరించారు.

అంతర్జాతీయ నాటక ప్రదర్శనకు 'శ్రీప్రకాష్' విద్యార్థులు

కాకినాడ రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సురేష్‌నగర్‌లోని శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాల విద్యార్థులు టెమిర్బెక్ జుర్గెనోవ్ కజక్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అల్మాటీ, కజకిస్థాన్, జాని బెన్కోవ్ యూనివర్శిటీ, షిమ్‌కెంట్లో, ఉజ్బెకిస్థాన్ వర్శిటీల్లో నాటక ప్రదర్శనలు ఇవ్వనున్నారని డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్ తెలిపారు. నటుడు, దర్శకుడు, విద్యావేత్త, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా పూర్వ విద్యార్థి కుమార్ సుమిత్ రూపకల్పన, దర్శకత్వంలో శిక్షణ పొందిన తమ విద్యార్థులు ఎల్లలు దాటి ప్రతిభ చాటనున్నారన్నారు. కింగ్ లియర్, జూలియస్ సీజర్ వంటి క్లాసికల్ షేక్‌స్పియర్ నాటకాలను ప్రదర్శించేందుకు పయనమై ఆ దేశాలకు వెళ్లారు. అక్టోబరు 1వరకు పలు వర్శిటీలలో పలు ప్రదర్శనలు ఇస్తారని చెప్పారు.

కాకినాడ జీజీహెచ్‌లో 2డి ఎకో సేవలు పునః ప్రారంభం

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో 2డి ఎకో సేవలు మంగళవారం పునః ప్రారంభమైనట్టు ఎన్టీఆర్ వైద్య సేవ డాక్టర్ వి.వరప్రసాద్ తెలిపారు. ఇన్ సోర్సింగ్ పరిధిలో బయటి నుంచి జీజీహెచ్‌కు హృద్రోగ వైద్య నిపుణులను తీసుకొచ్చి 2డి ఎకో పరీక్షలు నిర్వహిస్తున్నారు.ఈ నేపథ్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి ఇన్ సోర్సింగ్‌కు అనుమతి ఇవ్వడంతో 2డీ ఎకో సేవలకు మార్గం సుగమమైంది. మంగళవారం ఒక్కరోజే సుమారు 30కి పైగా పరీక్షలు చేసినట్టు డాక్టర్ వరప్రసాద్ చెప్పారు.

బొమ్మల కొలువు....

విశ్వేశ్వరీదేవి సన్నిధిలో ఆకట్టుకునేట్టు...

దివాన్‌చెరువు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నేటి యాంత్రిక జీవనంలో సైతం సంప్రదాయాలను పాటిస్తూ శరన్నవరాత్రి వేళ విశ్వేశ్వరీదేవి ఆలయంలో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. భక్తి ప్రధానంగానే కాకుండా కళాత్మక దృష్టిని కనబరుస్తూ డాక్టర్ రాంబాబు సతీమణి సుబ్బలక్ష్మి కొలువుదీర్చిన బొమ్మలు ఆకర్షిస్తున్నాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఒకపక్కన మెట్లు, మెట్లుగా ఏర్పాటుచేసి దానిపై తెల్లటి వస్త్రాన్ని ఉంచారు. గణపతి, బాలకుమారస్వామిమధ్య పసుపు కొమ్ములను గుట్టలుగా పోసి దానిపై విశ్వేశ్వరీదేవి బొమ్మను ఉంచారు. ఒకవైపున మహాలక్ష్మి, సీత, రుక్మిణి, రాధ, లలిత, సరస్వతి, శారదాంబ, రెండోవైపున కామాక్షి, విశాలాక్షి, అన్నపూర్ణ, గాయత్రి, అర్ధనారీశ్వరుడు, బాలాత్రిపురసుందరీదేవి, మహాకాళి, కనకదుర్గ, శైలపుత్రి బొమ్మలను అందంగా అలంకరించారు. అందులో నెమలి పింఛాలను కూడా ఉంచారు. మరి ఈ బొమ్మల కొలువును మనమూ ఓసారి చూసొద్దాం.



దివాన్‌చెరువులోని శ్రీవిశ్వేశ్వరీదేవి ఆలయంలో బొమ్మలకొలువు






కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులకు అనుగ్రహభాషణ చేస్తున్న శ్రీపీఠం అధిపతి స్వామి పరిపూర్ణానంద సరస్వతి

వైభవంగా మహా శక్తి యాగం

కాకినాడ శ్రీపీఠంలో రెండో రోజు 22 కోట్లకు చేరుకున్న లలితా సహస్రనామ కుంకుమార్చనలు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రమణయ్యపేటలోని శ్రీపీఠం గోశాల ప్రాంగణంలో స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో మొదలైన మహాశక్తి యాగం మంగళవారం రెండో రోజుకి చేరుకుంది. శ్రీపీఠంలో ఐశ్వర్యాంబిక అమ్మవారికి అర్గళా స్తోత్ర హోమం, సహస్ర చండీ, వారాహి, ప్రత్యంగిరా, బగళాముఖి, రాజశ్యామల, వటుక భైరవ హోమం, సహస్ర రుద్ర మహా రుద్ర హోమం నిర్వహించారు. స్వామి పరిపూర్ణానంద భక్తులకు అనుగ్రహభాషణ చేస్తూ... సకల సృష్టికి మొట్టమొదట తల్లిదండ్రులు సూర్య చంద్రులని, వారి అనుగ్రహం లేకపోతే ఆహారం పండదన్నారు. రెండో తల్లిదండ్రులైన గోమాత, వృషభం లేకపోతే ఎరువు, భూమి దున్నకపోతే పంట పండదన్నారు. మూడో తల్లిదండ్రులు రైతు అని, ఇతను పండించకపోతే ఆహారం ఉండదన్నారు. నాలుగో తల్లిదండ్రులు అమ్మ అని, ఆమె ఆహారం వండిపెట్టకపోతే మనుగడ ఉండన్నారు. మనం కేవలం కళ్లతో చూస్తే పొందే ఆనందాన్ని చక్షురానందం, ఇంద్రియ ఆనందం అంటామన్నారు. అమ్మ నామం, పారాయణ చేసి పూజిస్తే ఇంద్రియానందం పొంది అనుగ్రహానికి పాత్రులు కావచ్చన్నారు. వేలాది మంది మాతృమూర్తుల సంకల్పం, పట్టుదలతో రెండో రోజు 22కోట్ల లలితా సహస్రనామ కుంకుమార్చనలు పూర్తయ్యాయన్నారు. అష్టమి తిథి ప్రభావం తీవ్రంగా ఉంటుందని, దానిని తగ్గించి అందరికీ మంచికోసం అమ్మవారిని గట్టిగా ఆరాధన చేసేందుకు వీలుగా బగళాముఖి హోమం, వారాహి అమ్మవారికి ప్రత్యంగిరా హోమం, చండీ హోమంలను ప్రత్యేకంగా జరపనున్నట్టు తెలిపారు. ఈ నెల 29న సుమారు 24 వేల మంది విద్యార్థులతో త్రికోటి మహా సరస్వతి పూజ నిర్వహిస్తామన్నారు. ప్రముఖ కవి, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మహాశక్తి యాగంపై 'లలిత' పేరుతో సినిమా తీయబోతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. లలితాసహస్రనామంపై రాసిన పాటను బుధవారం మహాశక్తి యాగం వేదికపై జొన్నవిత్తుల సమక్షంలో ఆవిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు పాల్గొన్నారు. ట్రాఫిక్, బందోబస్తు ఏర్పాట్లను సర్పవరం సీఐ బి.పెద్దిరాజు ఆధ్వర్యంలో ట్రాఫిక్ సీఐ రామారావు సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు.





గాయత్రీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకుని హారతి తీసుకుంటున్న భక్తులు

దేవీచౌక్‌లో గాయత్రీ దేవిగా...


అమ్మవారిని పెద్ద ఎత్తున దర్శించుకున్న భక్తులు... ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో దేవీచౌక్‌లో శరన్నవరాత్రి మహోత్సవాల్లో రెండో రోజైన మంగళవారం అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. నగర ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపార ప్రముఖులు, అధికారులు అమ్మవారిని దర్శించుకుని అనుగ్రహం పొందారు. దేవీచౌక్ సెంటరు మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణలతో వెలుగొందుతోంది. దేవాలయాల గోపురాల సెట్టింగులు, దేవతామూర్తుల లైటింగ్ బోర్డులు ఆకట్టుకుంటున్నాయి. దసరా సెలవుల కారణంగా సాయంత్రం పూట ఉత్సవాలను తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు. రోడ్డుకిరువైపులా బొమ్మలు, చిరుతిళ్ల దుకాణాలు తిరునాళ్లను తలపిస్తోంది. రాత్రి నాట్య ప్రదర్శనలు, నాటకాలు, సినీ సంగీత విభావరులు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి వీటిని అధిక సంఖ్యలో యువత, ప్రజలు తిలకించారు.





మంగళవారం రాత్రి ఆకట్టుకున్న కాళికా నృత్య ప్రదర్శన, భక్తులతో కిక్కిరిసిన దేవీచౌక్



గాజుల దుర్గమ్మ

దేవీ శరనవరాత్రుల్లో భాగంగా కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కొమరగిరిలో బాలకనకదుర్గ మంగళవారం గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

- కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి)

ఆంధ్రా క్రికెట్ జట్టు ఫీల్డింగ్ కోచ్‌గా శ్రీనివాస్



అంబాజీపేట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రంజీ క్రికెట్ జట్టు ఫీల్డింగ్ కోచ్‌గా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటకు చెందిన సీనియర్ కోచ్ నిమ్మకాయల శ్రీనివాస్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నుంచి ఉత్తర్వులు అందినట్లు శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. శ్రీనివాస్ ప్రస్తుతం గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. గతంలో రెండుసార్లు ఆయన రంజీ జట్టుకు ఫీల్డింగ్ కోచ్‌గా ఉన్నారు. 2005లో ఏపీ రంజీ క్రికెట్ జట్టు ప్రోబబుల్స్‌లో ఎంపికయ్యారు. అంబాజీపేటలో నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రికెట్ సబ్ సెంటర్ కోచ్‌గా శ్రీనివాస్ తన ప్రస్థానం ప్రారంభించి నేడు రాష్ట్ర జట్టుకు ఫీల్డింగ్ కోచ్‌గా ఉన్నారు. తన ఎంపిక పట్ల ఏసీఏ అధ్యక్షుడు కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్, ఏసీఏ ఎపెక్స్ కౌన్సిల్ సభ్యులకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

అలరించిన తేజస్వి గాత్ర కచేరీ



కీర్తన ఆలపిస్తున్న తేజస్విని

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సరస్వతి గాన సభ 122వ దసరా సంగీత, నృత్య, నాటకోత్సవాలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. నగరంలోని సూర్యకళా మందిరంలో విజయవాడకు లంక తేజస్వి గాత్ర కచేరీ అలరించింది. ధన్యాసి రాగంలో నిఖిలలోక నాయకి వర్ణంతో ప్రారంభించి, దీక్షితుల వారి శ్రీగణేశాత్పరం, త్యాగరాజు స్వామి బంటురీతికొలువు... మొదలైన కృతులు గానం చేశారు. ఆమెకు వయోలిన్‌పై అంబటిపూడి కామాక్షి, మృదంగంపై కార్తికేయ, ఘటంపై సరస్వతుల హనుమంతరావు వాద్య సహకారం అందించారు. సరస్వతి గానసభ సభ్యులు, అధిక సంఖ్యలో సంగీతప్రియులు పాల్గొన్నారు..

'తూర్పు'న ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు

- రూ.1,600 కోట్లతో వాటర్ గ్రిడ్ పనులకు శ్రీకారం
- వసంతవాడలో భూముల పరిశీలనలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్



వసంతవాడలో ప్రాజెక్టు మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ఆత్రేయపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షితమైన తాగునీటి జలాలను ప్రతి ఇంటికి అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకు గాను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తొలివిడతగా రూ.1650 కోట్లతో వివిధ నియోజకవర్గాల్లో వాటర్ గ్రిడ్ పథకం పనులను ప్రారంభిస్తున్నట్టు అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం వసంతవాడ, దేశాలమ్మ పుంతలో రెండు ప్రాంతాల్లో ఈ పథకం కోసం అను వైన పంట పొలాలను ఆయన పరిశీలించారు. సుమారు పది ఎకరాలు భూసేకరణ కోసం చర్యలు చేపడుతున్నామని చెప్పారు. సెంట్రల్ డెల్టా పరిధిలో బొబ్బర్లంక బ్యారేజీ నుంచి గోదావరి జలాలను శుద్ధి చేసి ట్రంక్ లైన్ల ద్వారా తాగునీరు అందించనున్నారు. బ్యారేజీ దిగువ నుంచి ఇన్‌టేక్ వెల్స్ నిర్మించి అక్కడ నుంచి దిగువకు మళ్లిస్తామన్నారు. దీనికి సంబంధించిన ప్లాంట్‌ను నిర్మించేందుకు భూములు పరిశీలిస్తున్నామన్నారు. సెంట్రల్ డెల్టా పరిధిలోని కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాలలో ట్రంక్ లైన్లు ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ వివరించారు. అలాగే ఈస్టర్న్ డెల్టా పరిధిలోని ధవళేశ్వరం బ్యారేజీ వద్ద శుద్ధి చేసిన జలాలను ఫిల్టర్ చేసి అనపర్తి, కాకినాడ, రామచంద్రపురం, ముమ్మిడివరం నియోజకవర్గాలకు పైపులైన్ల ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. ఈస్టర్న్ డెల్టా పరిధిలోని 250 గ్రామాలు, సెంట్రల్ డెల్టా పరిధిలోని 635 గ్రామాలకు తొలివిడత శుద్ధి చేసిన జలాలను అందిస్తామన్నారు. మెగా ఇంజనీరింగ్ సంస్థ ఈ కాంట్రాక్టు చేపట్టిందన్నారు. శుద్ధి చేసిన జలాలు ట్రంక్‌లైన్ల ద్వారా రక్షిత మంచినీటి పథకాలకు అనుసంధానం చేసి ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా ప్రతి ఇంటి కుళాయిలకు చేరుతుంది. సురక్షిత జలాలను అందించి ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు ఈ ప్రాజెక్టు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం ఈ ప్రాజెక్టు సంబధించిన భూములను వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ మహేష్‌కుమార్ పరిశీలించారు.ఈ కార్యక్రమం లో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణా రెడ్డి, అమలాపురం ఆర్డీవో శ్రీకర్, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఇంజనీర్లు పద్మనాభం, రవికుమార్, తహశీల్దారు రాజేశ్వరరావు, అసిస్టెంట్ ఇంజనీర్లు భాగ్యరాజు, శ్రీధర్, ఎస్ఐ ఎస్.రాము, టీడీపీ మండలాధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



భూసేకరణ పరిశీలిస్తున్న దృశ్యం

ఆరు పథకాలు.. అనేక ప్రయోజనాలు..

● గ్రామీణ ప్రజలకు తపాలా బీమాతో ధీమా
● తక్కువ ప్రీమియం.. ఎక్కువ బోనస్

సామర్లకోట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా ఆరు రకాల బీమా పథకాలను అమలుచేస్తోంది. తక్కువ ప్రీమియం, ఎక్కువ బోనస్‌లతో పాలసీదారులకు లాభాల భరోసాను ఇస్తోంది. సురక్ష, సువిధ, సుమంగళ్, సంతోష్, గ్రామప్రియ, చిల్డ్రన్ పాలసీ పేర్లతో ఆరు పథకాలను ప్రవేశపెట్టింది. ఒక్కో పథకం ద్వారా రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకూ పాలసీలు చేసుకునే అవకాశం కల్పించింది. వీటిలో ఒక్కో పథకానికి బోనస్‌ను రూ.60, రూ.48, రూ.45 చొప్పున అందించనుంది. లబ్ధిదారుడు మూడేళ్లపాటు జరిపిన చెల్లింపులపై రుణసదుపాయం కల్పిస్తోంది. ప్రీమియం చెల్లిస్తున్న సమయంలో పాలసీదారుడు మృతిచెందితే చెల్లించిన పాలసీ మొత్తాన్ని ఒకేసారి నామినీకి అందజేస్తారు. ఈ పథకాల్లో చేరదలిచినవారు ఆధార్, పాన్‌కార్డు కలిగి ఉండాలి. జిల్లాలోని ఏ పోస్టాఫీసులోనైనా ప్రీమియం చెల్లించవచ్చు. ఆదాయపు పన్ను రాయితీ, నామినేషన్ సదుపాయం, ఆన్‌లైన్‌లో ప్రీమియం చెల్లించే అవకాశాన్ని తపాలా శాఖ కల్పించింది. పోస్టల్ జిల్లా ఉన్నతాధికారి అందించిన సమాచారం మేరకు తపాలా శాఖలో వివిధ పథకాల వివరాలు ఇలా ఉన్నాయి.

సంతోష్:
సంతోష్ పథకం కింద రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకూ పాలసీలను నిర్ణయించారు. 19 నుంచి 55 మధ్య వయస్సు కలిగిన వారిని ఈ పథకానికి అర్హులుగా చేర్చారు. బోనస్ కింద రూ.1000కి రూ48 వర్తిస్తుంది. 19 ఏళ్ల లబ్ధిదారుడు పథకంలో చేరితే మెచ్యూరిటీని 35, 40, 45, 50, 55, 58, 60 ఏళ్లకు నిర్దేశించుకోవచ్చు. మెచ్యూరిటీ ఏ సంవత్సరం వరకూ అయితే నిర్దేశించుకుంటారో.. ఆ సంవత్సరం నుంచి మరో ఐదేళ్లపాటు వేచి ఉండాల్సి ఉంటుంది. అనంతరం పాలసీ మొత్తానికి రూ.48లు బోనస్‌గా అదనంగా జోడించి లబ్ధిదారుడికి అందజేస్తారు. రూ.10 లక్షల పాలసీ చేసిన లబ్ధిదారుడికి బోనస్‌తో కలిపి మొత్తం రూ.29.68లక్షలు పాలసీ మొత్తం వర్తిస్తుంది.

సురక్ష:
సురక్ష పథకం కింద రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకూ పాలసీలను నిర్ణయించారు. 19 నుంచి 55 సంవత్సరాల మధ్య కలిగిన వారిని ఈ పథకానికి అర్హులుగా చేర్చారు. బోనస్ కింద రూ.1000కి రూ.60 వర్తిస్తుంది. 60 సంవత్సరాల వరకూ ప్రీమియం చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. అనంతరం 80 ఏళ్ల తర్వాత రూ.10 లక్షలు, అందుకు సంబంధించి రూ.60 బోనస్‌తో కలిపి మెచ్యూరిటీ మొత్తాన్ని లబ్ధిదారుడికి అందజేస్తారు. లబ్ధిదారుడు మరణిస్తే ఆ మొత్తాన్ని నామినీకి అందజేస్తారు. రూ.10 లక్షలు పాలసీ 60 సంవత్సరాల పాటు చెల్లిస్తే బోనస్‌తో కలిపి దాదాపు రూ.34.60 లక్షలు లబ్ధిదారుడికి అందజేస్తారు. మూడేళ్ల తర్వాత పాలసీదారుడు రుణసదుపాయం కూడా ఉంటుంది.

గ్రామప్రియ:
ఈ పథకంలో 10 సంవత్సరాల పాలసీ మాత్రమే నిర్ణయించారు. ఇందులోని 20 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల వారిని అర్హులుగా చేర్చారు. పథకంలో 10 సంవత్సరాల పాలసీలో మనీబ్యాక్ కింద 4,7 సంవత్సరాలకొకసారి 20 శాతం బోనస్ లభించనుంది. మిగిలిన మొత్తాన్ని పాలసీ ముగిసే సమయంలో బోనస్‌గా అదనంగా జోడించి అందంచనున్నారు.

సువిధ:
సువిధ పథకం కింద రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకూ పాలసీలను నిర్ణయించారు. 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారిని ఈ పథకానికి అర్హులుగా చేర్చారు. ఈ పాలసీని సురక్ష పథకంలో మాదిరి 60 సంవత్సరాల వరకూ నిర్ణయించుకోవచ్చు. లేదా సంతోష్ పథకంలో నిబంధనల మేరకు కన్వర్ట్ చేసుకునే అవకాశం కల్పించారు. సురక్ష పథకం కింద ప్రీమియం చెల్లింపులు ఐదేళ్లపాటు చేయాల్సి ఉంటుంది. ఆ తరువాత సంవత్సరంలోపు సంతోష్ పథకం కింద అయితే రూ.60 బోనస్.. సంతోష్ పథకం కింద కన్వర్ట్ చేసుకుంటే రూ.48 బోనస్‌గా లభిస్తుంది. లబ్ధిదారుడి చెల్లింపులు బట్టి బోనస్‌లు వర్తిస్తాయి.

సుమంగళ్:
ఈ పథకంలో రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకూ పాలసీలను నిర్ణయించారు. 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారిని ఈ పథకానికి అర్హులుగా చేర్చారు. ఈ పథకంలో రూ.45లు బోనస్‌గా లభిస్తుంది. పథకంలో రెండు రకాల బోనస్‌లను నిర్ణయించారు. 15 సంవత్సరాల నుంచి పాలసీను ఎంచుకున్న లబ్ధిదారుడికి మనీబ్యాక్ కింద 6 సంవత్సరాలకొకసారి, 9 సంవత్సరాలకొకసారి, 12 సంవత్సరాలకొకసారి 20 శాతం మనీబ్యాక్ రూపంలో బోనస్ లభించనుంది. అనంతరం మిగిలిన బోనస్‌ను పాలసీ ఎంచుకున్న లబ్ధిదారుడికి మనీబ్యాక్ కింద 8 సంవత్సరాలు, 12సంవత్సరాలు, 16 సంవత్సరాలకొకసారి 20 శాతం చొప్పున మనీబ్యాక్ రూపంలో బోనస్ లభిస్తుంది. ఈ పథకంలో ఎలాంటి రుణసదుపాయం ఉండదు.

పిల్లల పాలసీ



ఈ పాలసీలో చేరే పిల్లలకు సంబంధించిన తల్లిదండ్రులు, సురక్ష, సువిధ పథకాల్లో లబ్ధి దారులై ఉండాలి. ఆయా పథకాల్లో ఉన్న తల్లిద ండ్రుల పిల్లలకు మాత్రమే ఈ పథకం వర్తించనుంది. అది కూడా తల్లిదండ్రుల వయ స్సు 45లోపు ఉండాలి. ఈ పథకంలో 5 నుంచి 20 ఏళ్లలోపు ఉన్న పిల్లలకు పాలసీ వర్తిస్తుంది. ఈ పథకంలో రూ.20 వేల నుంచి రూ.1లక్ష వరకూ పాలసీని నిర్ణయించారు. ఈ పథకంలో బోనస్ రూ.48గా నిర్ణయించారు.

ఖైదీ ప్రభాకర్‌ను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాల ఏర్పాటు



దుద్దుకూరు హైవేపై పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ నరసింహకిషోర్

త్వరలో అరెస్టు చేస్తాం
కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్



ఖైదీ ప్రభాకర్ (ఫైల్‌ఫొటో)

దేవరపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీసుల కళ్లు కప్పి తప్పించుకున్న సెంట్రల్ జైల్ ఖైదీ బత్తుల ప్రభాకర్ కోసం పోలీసులు జల్లెడ పడుతున్నారు. ఇందుకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి ఖైదీ బత్తుల ప్రభాకర్‌ను కేసు విచారణ నిమిత్తం సోమవారం విజయవాడ తీసుకెళ్లి ఎస్కార్ట్‌తో రాజ మహేంద్రవరం వస్తూ రాత్రి దేవరపల్లి మండలం దుద్దుకూరు జాతీయ రహదారి వద్ద ఓ రెస్టారెంట్ వద్ద ఆపారు. దీంతో బత్తుల ప్రభాకర్ మూత్రం వస్తుందని చెప్పగా కుడిచేతికి ఉన్న సంకెళ్లు తొలగించడంతో ప్రభాకర్ పొలాల్లోకి పారిపోయాడు. పోలీసులు వెంబడించినా దొరకలేదు. దీంతో అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. దీనిపై కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ విలేకర్లతో సమావేశంలో మాట్లాడుతూ వ్యాన్‌లో ముగ్గురు ఖైదీలు ఉన్నారని, మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ బత్తుల ప్రభాకర్ కోసం ఏపీ, తెలంగాణలో గాలింపు ముమ్మరం చేశామన్నారు. ప్రభాకర్ గతంలో దేవరపల్లి ప్రాంతంలో ఒక స్కూల్ వద్ద రూ.3లక్షలు నగదును చోరీ చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడని, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఉండ్రాజవరంలోని ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలో రూ.30 లక్షలు చోరీ కేసులో కూడా నిందితుడిగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రభాకర్‌ను పట్టుకోవడానికి 15 మంది చొప్పున 3ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. డ్రోన్‌తో సాంకేతిక పరిజ్ఞానంతో చెక్ పోస్టుల ద్వారా జాబ్‌కార్డులతోనూ ముమ్మరంగా దర్యాప్తు చేయడం జరుగుతుందన్నారు. ఏలూరు ఐజీ అశోక్ కుమార్, తూర్పుగోదావరి జిల్లా జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలు, సూచనల మేరకు నిందితుడిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. బత్తుల ప్రభాకర్ ఏపీ, తెలంగాణలో 66 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని తెలిపారు. ప్రభాకర్‌ను త్వరలో అరెస్టు చేస్తామని డీఎస్పీ చెప్పారు.

గూగుల్ క్లౌడ్‌తో 'ఆదిత్య' ఎంవోయూ



ఎంవోయూ కుదుర్చుకున్న గూగుల్ క్లౌడ్, ఆదిత్య ప్రతినిధులు

గండేపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ గూగుల్ క్లౌడ్‌తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుని గూగుల్ క్లౌడ్ డిజిటల్ క్యాంపస్ (ఎలైట్ టియర్)గా గుర్తింపు పొందిన ఆంధ్రప్రదేశ్‌లోని తొలి యూనివర్సిటీగా నిలిచిందిని ప్రో చాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. ఈ భాగస్వామ్యంతో ఆదిత్య యూనివర్సిటీ గూగుల్ క్లౌడ్ డిజిటల్ క్యాంపస్‌ను ఏర్పాటు చేసిందన్నారు. దీని ద్వారా గూగుల్ క్లౌడ్ సర్టిఫికేషన్లు, అకడమిక్ ప్రోగ్రామ్‌లు, అండర్ గ్రాడ్యుయేట్ పాఠ్యక్రమాల్లో భాగం కానుండగా విద్యార్థులకు ఇండస్ట్రీ-లింక్డ్ ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, పరిశోధనా సహకారాలు వంటి అవకాశాలు కల్పిస్తారన్నారు. కార్యక్రమానికి సౌత్ ఇండియా గూగుల్ క్లౌడ్ రీజినల్ హెడ్ సిద్ధార్థ దల్వాడి ముఖ్య అతిథిగా, హెనోటిక్ గ్రూప్ వ్యవస్థాపకుడు సీఈవో బి.మల్లేశం గౌరవ అతిథిగా హాజరయ్యారు. గూగుల్ క్లౌడ్‌కి చెందిన ప్రతినిధి బృందంతో పాటు ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్.ఎస్.రమాశ్రీ (ప్రో వైస్ చాన్సలర్ అకడమిక్స్), డాక్టర్ ఎ.రమేష్ (ప్రో వైస్ చాన్సలర్, ఇంజనీరింగ్/సైన్సెస్), డాక్టర్ రవి ధంగజాం (ప్రో వైస్ చాన్సలర్, స్ట్రాటజీ/ పార్ట్నర్‌షిప్స్), డాక్టర్.జి.సురేష్ (రిజిస్ట్రార్) పాల్గొన్నారు. కార్యక్రమం కోఆర్డినేటర్‌గా డాక్టర్ ఎంరాజాబాబు వ్యవహరించారు.

తప్పుడు సర్టిఫికెట్‌తో డీఎస్సీలో ఉద్యోగం



జయశాంతి (ఫైల్‌ఫొటో)

కాకినాడ క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రమణయ్యపేటలో నివసిస్తున్న ఆముదాల జయశాంతి తాజా డీఎస్సీ నియామకాల్లో ఉద్యోగం పొందింది. అయితే తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించి ఉద్యోగాన్ని దక్కించుకున్నట్టు తదనంతర విచారణలో వెల్లడైంది. వివరాల్లోకి వెళితే రంగంపేట పోలీస్‌స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జయశాంతి తాజాగా డీఎస్సీలో ఉద్యోగానికి అర్హత సాధించింది. ఎకనామికల్లీ వీకర్ సెక్షన్ (ఈడబ్ల్యూఎస్) కోటాలో ఆమె ఉద్యోగం పొందింది. అయితే ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ తీసుకోవడంలో అవకతవకలకు పాల్పడింది. ఆమెకు వివాహం కాగా భర్త తాతారావు కానిస్టేబుల్ సంపాదనను దాచి తండ్రిని సంరక్షకుడిగా ప్రస్తావిస్తూ తన ఉద్యోగాన్ని మాత్రమే చూపి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ పొందింది. అయితే ఉద్యోగ జాబితాలో ఆ మె తరువాత స్థానంలో ఉన్న అభ్యర్థులు విషయాన్ని తెలుసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో విద్యాశాఖ ఆమె అందించిన ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌పై విచారణ చేపట్టింది. అవకతవకలకు పాల్పడినట్టు నిర్ధారణ అయ్యింది. దీంతో ఆమె నుంచి అధికారులు వివరణ తీసుకున్నారు. జయశాంతి చేసిన మోసం తెలిసి ఉద్యోగాన్ని తొలగించేందుకు నిర్ణయం తీసుకున్నారు. పోలీస్‌శాఖ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంది. శాఖాపరమైన చర్యలకు సిద్ధమవుతోంది.

భార్యపై భర్త హత్యాయత్నం

● కోనసీమ జిల్లా కోటిపల్లిలో ఘటన ● ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

కె.గంగవరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కోటిపల్లి గ్రామంలో భార్యపై హత్యాయత్నం చేసిన భర్తపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్టు పామర్రు ఎస్‌ఐ ఎస్.కె. జానీబాషా చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. కోటిపల్లి గ్రామానికి చెందిన మొగమాటి అశ్వనికి, రామచంద్రపురానికి చెందిన దత్తవీరవెంకట శివకుమార్‌కు వివాహం అయ్యింది. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. ఇటీవల శివకుమార్ మద్యానికి బానిసయ్యాడు. కుటుంబాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో అశ్వని కోటిపల్లిలో ఉంటుంది. సోమవారం రాత్రి శివకుమార్ దళితవాడలో ఉన్న అశ్వని వద్దకు వచ్చి గొడవ పడ్డాడు. కులం పేరుతో దూషించాడు. అశ్వనిని కడుపులో తన్ని చంపడానికి ప్రయత్నించాడు. ఈ మేరకు అశ్వని ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. మంగళవారం అమలాపురం డీఎస్పీ టిఎస్ఆర్‌కె.ప్రసాద్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. బాధిత మహిళ నుంచి వివరాలు సేకరించారు. మహిళల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శివకుమార్‌ను త్వరలోనే అరెస్టు చేస్తామని ఆయన తెలిపారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
CHANGE OF NAME
I, BORRA DEVI W/O BORRA RAMESH, R/O 62-13-185, MAHALKSHMI NAGAR, TURANGI, JAGANNADHAPURAM, KAKINADA (URBAN), DIST EAST GODAVARI, AP- 533002, CHANGED MY NAME AS BORRA VEERA VENKATA KANAKA DURGA DEVI W/O BORRA RAMESH.
AJZ256010

4 Lines CLASSIFIED Rs.230/- Only

అంతర్వేదిలో నటి కవిత పూజలు

అంతర్వేది, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి మంగళవారం సినీ నటి కవిత కుటుంబ సమేతంగా విచ్చేసి పూజలు చేశారు. ఆమెకు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి ఆలయంలో దర్శనం నిర్వహించి వేద పండితులు మహదాశీర్వచనం అందించారు. స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందించారు.



నటి కవితకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

రోడ్డెక్కిన మత్స్యకారులు

● డిమాండ్లను పరిష్కరించాలని ఉప్పాడ బీచ్‌రోడ్డులో ఆందోళన ● రసాయన పరిశ్రమలపై ఆగ్రహం





కాకినాడ జిల్లా ఉప్పాడలో ఆందోళన చేస్తున్న మత్స్యకారులు, ఆందోళనకారులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌మీనా

కొత్తపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను పరిష్కరించి, న్యాయం చేయాలని తీరప్రాంత మత్స్యకారులు మూకుమ్మడిగా రోడ్డెక్కారు. కాకినాడ జిల్లా ఉప్పాడ, అమీనబాద్ గ్రామాలకు చెందిన సుమారు 500 మంది మత్స్యకారులు మంగళవారం ఉదయం 6 గంటల నుంచి ఉప్పాడ బీచ్‌రోడ్డులో ఆందోళన చేపట్టారు. ఉప్పాడ-కాకినాడ, కాకినాడ-తుని, ఉప్పాడ- పిఠాపురం రోడ్లకు మత్స్యకారులు ఐరన్ టేబుళ్లను అడ్డంగా వేసి రహదారులను నిర్బంధం చేశారు. సాయంత్రం 6 గంటల వరకు ఆందోళన సాగించారు. సముద్ర తీరప్రాంతాల్లో నెలకొల్పిన రసాయన పరిశ్రమల నుంచి విడుదల చేసిన రసాయనాల కారణంగా మత్స్యసంపద పూర్తిస్థాయిలో నశించిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో సముద్రంలో చేపలు దొరుకుతాయనే నమ్మకంలేదని వాపోయారు. వేట తప్ప మరో ఉపాధి తమకు తెలియదని, రసాయన పరిశ్రమల వల్ల ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు టుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వేట లేని సమయంలో వేరే ప్రాంతాలకు వెళ్లి వేట చేసేటపుడు అక్కడ మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య పరిశ్రమల కారణంగా జీవనోపాధి కోల్పోయిన ప్రాంతాల్లో మత్స్యకారులకు ఆయా కంపెనీలు నష్టపరిహారం చెల్లించాయని, అదేవిధంగా కూడా తమకు నష్టపరిహారం చెల్లించాలని ముక్తకంఠంతో విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఉప్పాడ-అమీనబాద్ మినీహార్బర్ నుంచి వేటకు వెళ్లిన మత్స్యకారుల బోట్లు తిరగబడి పలువురు మత్స్యకారులు మృత్యువాత పడ్డారని, హార్బర్ నిర్మాణంలో లోపాలున్నాయని వాటిని సరిచేయాలని డిమాండ్ చేశారు. మత్స్యకారుల సమస్యలన్నింటిపై కలెక్టర్ లేదా ఎమ్మెల్యే పవన్ కానీ హామీ ఇచ్చేవరకు ఆందోళన విరమించే ప్రసక్తిలేదని వారు హెచ్చరించారు.

కాలుష్య పరిశ్రమలపై నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసి చర్యలు : జేసీ
మత్స్యకారుల ధర్నా వద్దకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా వెళ్లారు. తీర ప్రాంతాల్లో నెలకొల్పిన రసాయన పరిశ్రమల నుంచి విడుదల చేస్తున్న వ్యర్థజలాల కారణంగా మత్స్యసంపద అంతరించిపోతుందన్న విషయంపై నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసి చర్యలు చేపడతామని మత్స్యకారులకు వివరించారు. అదేవిధంగా ఓఎన్‌జీసీ, ఇతర కంపెనీలు ఆయా ప్రాంతాల్లో నష్టపోయిన మత్స్యకారులకు చెల్లించిన నష్టపరిహారాల నివేదికలను పరిశీలించి తగు చర్యలు చేపడతామని స్పష్టంచేశారు. వేట లేని సమయంలో వేరే ప్రాంతానికి వెళ్లి వేట చేసే సమయంలో ఇబ్బందులు పడుతున్న ఉప్పాడ తీరప్రాంత మత్స్యకారులకు, మత్స్యశాఖ మంత్రి ఆధ్వర్యంలో 2రోజుల్లో సమావేశం ఏర్పాటు చేస్తామని, స్థానిక మత్స్యకార పెద్దలు హాజరు కావాలని ఆయన కోరారు.

డిప్యూటీ సీఎం రావాల్సిందే..
మత్స్యకారుల సమస్యలను పరిష్కరిస్తామని జేసీ చెప్తుండగా కలెక్టర్ కానీ, డిప్యూటీ సీఎం ఆందోళన దగ్గరకు వచ్చి హామీ ఇస్తేకానీ విరమించేది లేదని మత్స్యకారులు హెచ్చరించారు. పరిస్థితిని గమనించిన కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లిబాబు ఫోన్‌లో డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయ అధికారులతో మాట్లాడారు. డిప్యూటీ సీఎం శాసన సభ సమావేశాల్లో ఉన్నారన్న సమాధానం రావడంతో ఆందోళన కారులకు తెలియజేశారు. అందుకు మత్స్యకారులు ససేమిరా అనడంతో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ కొత్తపల్లి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకు న్నారు. మత్స్యకార నాయకులను తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లాల్సిందిగా ఆర్డీవో తెలియజేశారు. కానీ వారు ఎంతకీ వెళ్లకపోగా డిప్యూటీ సీఎం వస్తేకానీ ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేయడంతో కలెక్టర్‌తో అందరూ వెను దిరిగారు. కోనపాపపేటలో కూడా మత్స్యకారులు ఆందోళన చేపట్టారు. ఉమ్మిడిజాన్, నక్కా మణిం కంఠ, సూరాడరాజు, సూరాడ నాగేశ్వరరావు, మేరుగుభూషణం, ఎల్లాజీ, చోడిపల్లి ప్రసాద్ తదితర మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

నేడు ఆందోళనే...
బుధవారం ఉదయం కూడా మత్స్యకారులంతా ఆందోళనలో పాల్గొనాలని మత్స్యకార నాయకులు విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ సీఎం ఉప్పాడ విచ్చేసి స్పష్టమైన హామీ ఇచ్చేవరకు ఆందోళన విరమించేదిలేదని మత్స్యకార పెద్దలు హెచ్చరించారు. ఒకవేళ డిప్యూటీ సీఎం పవనకల్యాణ్ సానుకూలంగా స్పందించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేసేందుకు సమాయత్తం కావాలని సాయంత్రం జరిగిన మత్స్యకారుల సమావేశంలో ఏక గ్రీవంగా తీర్మానించారు.

మారుతీనగర్‌లో విద్యుదాఘాతం

హై ఓల్టేజీతో 40 గృహాల్లో ఏసీ, వాషింగ్ మిషన్లు, మిక్సీలు, ఫ్యాన్లు దగ్ధం






కాలిపోయిన ఏసీ, వాషింగ్ మిషన్

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం శివారు మారుతీనగర్‌లో సోమవారం తెల్లవారుజామున హైఓల్టేజీ కారణంగా సుమారు 40 ఇళ్లలో సుమారు రూ.10 లక్షల విలువైన ఏసీ, ఫ్రిజ్, వాషింగ్ మిషన్లు, ఫ్యాన్లు, టీవీలు, లైట్లు మాడిపోయాయి. దీంతో మారుతీనగర్ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. మారుతీనగర్‌లో సుమారు 250 గృహాలు ఉండగా వారి విద్యుత్తు అవసరాల కోసం స్థానికంగా 60, 40 వోల్టు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లను విద్యుత్తు శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. సోమవారం అర్ధరాత్రి అకస్మాత్తుగా ఇళ్లలోని ఎలక్ట్రానిక్ వస్తువుల నుంచి పొగలు రావడం, కరెంటు నిలిచి గృహోపకరణాలు హైఓల్టేజీతో దగ్ధం అయ్యాయి. సోమవారం అర్ధరాత్రి హైఓల్టేజీ సంభవించి, విద్యుత్తు సరఫరా నిలిచిపోతే మంగళవారం మధ్యాహ్నం 3 గంటల కూడా విద్యుత్ పునరుద్ధరణ చేయలేని పరిస్థితిలో విద్యుత్తు సిబ్బంది ఉన్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలిపోయిన గృహోపకరణాలను తిమ్మాపురం గ్రామ సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ పరిశీలించారు. జరిగిన నష్టాన్ని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. హై ఓల్టేజీతో జరిగిన నష్టాన్ని, విద్యుత్ పునరుద్ధరణపై కాకినాడ ఏడీఈ దృష్టికి సర్పంచ్ తీసుకెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్లు భూమికి తక్కువ ఎత్తులో, రక్షణ లేకుండా ఉన్నాయని తక్షణమే రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

మల్లిశాలలో పారిశ్రామిక పార్కు ఏర్పాటు అంశం పరిశీలిస్తాం : మంత్రి భరత్

అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే నెహ్రూ



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

అమరావతి/జగ్గంపేట, సెప్టెంబరు 23 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం మల్లిశాల గ్రామంలో అందుబాటులో ఉన్న 525 ఎకరాల ప్రభుత్వ భూమిలో పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. మంగళవారం అసెంబ్లీ ప్రశ్నోత్తల సమయంలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ.. మల్లిశాల గ్రామంలో ఒకే చోట ఉన్న 525 ఎకరాల భూమిలో గతంలో 42 టైల్స్ ఫ్యాక్టరీలు ఉండేవని, ఇప్పుడు అవన్నీ మూతబడిపోవడంతో వాటిపై ఆధారపడి జీవించే వేలాదిమంది కార్మికులు ఉపాధి కోల్పోయారని తెలిపారు. ఇక్కడ ఇండస్ట్రియల్ పార్కు ను ఏర్పాటుకు రోడ్డు, రైల్వే, ఎయిర్ కనెక్టివిటీతో పాటు నీటి లభ్యత పుష్కలంగా ఉందని తెలిపారు. ఇక్కడ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తే మా ప్రాంతం అభివృద్ధి చెందుతుందని కోరారు. దీనిపై మంత్రి భరత్ స్పందిస్తూ.. 'ఇటీవల ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబ డులు పెట్టేందుకు దుబాయ్ ప్రభుత్వ ప్రతినిధు లకు కొన్ని భూముల చూపించాం. మల్లిశాలలోని 525 ఎకరాల భూమి గురించి కూడా వారి దృష్టికి తీసుకువెళతాం. వారు కాదంటే ఏపీఐ ఐసీ ద్వారా ఏవిధంగా ఇండస్ట్రియల్ పార్కును అభివృద్ధి చేయొచ్చనే దానిపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తాం. సీఎం చంద్రబాబు ఆదేశాల మేర కు రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలతో ముందుకువెళ్తున్నాం. ఇప్పటికే పలు పార్కులు ప్రారంభించాం. మరికొన్నింటికి శంకుస్థాపన చేశాం. త్వరలో మరో 30 పార్కులను ప్రారంభించనున్నాం' అని పేర్కొన్నారు.

ఒమ్మంగి సొసైటీకి జరిమానా

ప్రత్తిపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి కలెక్టర్ షాన్‌మోహన్ రూ.25వేలు పెనాల్టీ విధించారు. ఒమ్మంగి పీఏసీఎస్ యూరియా ఎరువుల పంపిణీలో అవకతవకలకు పాల్పడటంపై కలెక్టర్ ఈ చర్యలు తీసుకున్నారు. ఈ ఆదేశాలు మంగళవారం ఒమ్మంగి పీఏసీఎస్‌కు అందజేసినట్టు మండల వ్యవసాయాధికారి జోకా అమృత తెలిపారు.

కారులో గంజాయి రవాణా

జగ్గంపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం టోల్ ప్లాజా వద్ద మంగళవారం ఆర్‌జే60 యూఏ 4616 నెంబరుగల ఇన్నోవా కారులో గంజాయి రవాణా చేస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. వారు కారును పట్టుకోవడానికి యత్నించగా కృష్ణవరం టోల్‌ప్లాజాను దాటి అడ్డదారిన పెద్దాపురం మండలం దివిలి గ్రామం వెళ్లి సుమారు 200 కిలోల గంజాయి బస్తాలను వదిలేసి కారు సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం వైపు వెళ్లినట్టు తెలిసింది.

వివాహిత అదృశ్యంపై కేసు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య గత కొంత కాలంగా విబేధాలు ఉన్న నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి భార్య కనిపించడం లేదని భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అమలాపురంపట్టణ ఎస్‌ఐ కిశోర్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడి గ్రామానికి చెందిన ఉప్పే లక్ష్మణ్‌తో విజయకుమారి (29)కి వివాహం జరిగింది. వారి మధ్య విబేధాల నేపథ్యంలో గత 5 నెలలుగా భార్య విజయకుమారి విడిగా ఉంటుంది. అమలాపురం ఎన్టీఆర్ మార్గ్‌లోని ఒక అపార్టుమెంట్‌లో అక్క వద్ద ఉంటున్న విజయకుమారి తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం అన్నిచోట్లా గాలించినా ప్రయోజనం లేకపోవడంతో భర్త లక్ష్మణ్ అమలాపురం పట్టణ పోలీసులకు మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదుచేసినట్టు ఎస్‌ఐ కిశోర్‌బాబు తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

50 సీసాలు స్వాధీనం

ఎటపాక, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలోని ఓ బడ్డీ దుకాణంలో బెల్ట్ షాపు నిర్వహిస్తూ అమ్మకాలు చేస్తుండగా మంగళవారం ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది దాడి చేశారు. 50 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేశారు. ఈక్రమంలో నెల్లిపాక మద్యం దుకాణం నుంచి ఆయా గ్రామాల బెల్ట్ షాపులకు మద్యం తరలిస్తున్న వారి నుంచి సుమారు 95 బాటిళ్ల మద్యంసీసాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

పవన్‌కల్యాణ్ అభిమానుల 'ఓజీ' సంబరాలు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నటించిన ఓజీ చిత్రం గురువారం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన అభిమానులు సంబరాలు జరిపారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ తోట సుధీర్, జనసేన నాయకుడు నున్న దొరబాబు భానుగుడి సెంటరు వద్ద 60 అడుగుల పవన్‌కల్యాణ్ కటౌట్‌ను ఆవిష్కరించారు. పాలాభిషేకం చేసి కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు.


ఐటీఐ ఉత్తీర్ణత పొందిన విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న ముఖ్య అతిథులు

ఘనంగా కాకినాడ ఐటీఐ స్నాతకోత్సవం

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ) స్నాతకోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ప్రిన్సిపాల్ ఎం. వేణుగోపాలవర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్ర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.జనార్దనరావు, ఐఎంసీ చైర్మన్ కె.రామకృష్ణ, జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు హాజరయ్యారు. వారు వృత్తి విద్య ప్రాముఖ్యతను, భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలను వివరించారు. కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి మూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గ సభ్యులు

ఎన్జీవో సంఘ అధ్యక్షుడిగా స్వామి

సామర్లకోట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్జీవో ఉద్యోగుల సంఘం సామర్లకోట తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా ఎంఎస్ఆర్ స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని లయన్స్ క్లబ్ భవనంలో సామర్లకోట తాలూకా యూనిట్ సర్వసభ్య సమావేశాన్ని ఎన్జీవో సంఘ జిల్లా నాయకుడు బీఆర్వీ చౌదరి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. అసోసియేట్ అధ్యక్షుడిగా పీవీ నూకరాజు, ఉపాధ్యక్షులుగా ఆర్.జమీమాకుమారి, పి.చరణ్‌కుమార్, కార్యదర్శిగా ఎస్.శ్రీనివాసు, సంయుక్త కార్యదర్శులుగా ఎన్వీ రత్నకుమారి, ఎస్కే రేష్మా, వి.లక్ష్మణస్వామి, డి.రామకుమారి, కోశాధికారిగా ఎ.తేజేశ్వరరావులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా నాయకులు బీఆర్వీ చౌదరి, కె.కేశవరావు, పాలపర్తి మూర్తిబాబు, పసుపులేటి శ్రీనివాసు, కేవీఎస్వీ ప్రసాద్, సరెళ్ల చంద్రరావు అభినందించారు.

పెట్రోలు బంకుపై విజిలెన్స్ దాడులు

564 లీటర్ల అదనపు ఆయిల్ గుర్తింపు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ వాకలపూడిలోని ఫిషింగ్ హార్బర్‌లో అయ్యప్పస్వామి పెట్రోలు, డీజిలు బంకుపై మంగళవారం సాయంత్రం విజిలెన్స్ అధికారుల ఆధ్వర్యంలో సివిల్ సప్లయిస్, తూనికలు-కొలతలు, కమర్షియల్ టాక్స్ అధికారులు దాడి నిర్వహించారు. లైసెన్స్ గడువు ముగిసినా అనధికారికంగా పెట్రోల్ విక్రయించడం, పన్ను ఎగవేస్తున్నారన్న ఫిర్యాదు మేరకు ఈ దాడులు చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. స్టాకు బేలన్స్‌లో ఉన్న దాని కంటే 564 లీటర్ల మెరైన్ ఆయిల్ అదనంగా ఉండటాన్ని గుర్తించారు. ఆయిల్ శాంపుల్స్ సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించినట్టు అధికారులు తెలిపారు. నివేదిక వచ్చే వరకు ఎటువంటి ఆయిల్ విక్రయాలు జరపరాదని నిర్వాహకుడిని ఆదేశించారు. దాడుల్లో ఏఎస్‌వో ప్రసన్నలక్ష్మి, ఎంఎస్‌వో వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.


పిఠాపురం పాదగయలో అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ


సామర్లకోటలో అన్నపూర్ణాదేవిగా బాలాత్రిపురసుందరి అమ్మవారు


తాళ్లరేవు మండలం పాత కోరింగలో పూజలు చేస్తున్న మహిళలు


పెద్దాపురం భువనేశ్వరి పీఠంలో గాయత్రీ దేవి అలంకరణలో భువనేశ్వరి అమ్మవారు

గాయత్రీ దేవిగా, బాలాత్రిపురసుందరిగా జగన్మాత దర్శనం

పిఠాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరీ దేవి మంగళవారం బాలాత్రిపురసుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దశమ శక్తి పీఠం అధిష్ఠాన దేవతైన పురుహూతికా అమ్మవారు మహాకాళి విశేష ఆభరణ అర్చనలో దర్శనమిచ్చారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఈవో, సహాయ కమిషనరు కాట్నం జగన్మోహనశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. శృంగేరీ శంకర మఠం నిర్వహణలో పెద్ద బజారులో వేంచేసియున్న మహాలక్ష్మి అమ్మవారు హంసవాహిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో హోమం జరిగింది. ఆలయ నిర్వాహకుడు ఇంద్రగంటి వెంకట గోపాలకృష్ణ తదితరులు పూజల్లో పాలుపంచుకున్నారు.

పాదగయలో జరుగుతున్న శరన్నవరాత్ర శతచండీయాగ మహోత్సవాల్లో భాగంగా పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, పండ్లు, పుష్పాలు సమర్పించారు. ఆయన్ను ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ ఆలయ మర్యాదలతో సత్కరించారు. పాదగయ మాజీ చైర్మన్ కొండేపూడి సూర్యప్రకాష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొజ్జా సతీష్, ఏలేరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ సోము సత్యనారాయణ, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): తాటిపర్తిలో అపర్ణాదేవిని నిమ్మకాయలతో విశేషంగా అలంకరించగా స్కందమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాడ శివాలయంలో లలితాదేవి చందనధారిణిగా భక్తులను అనుగ్రహించారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): కుమారరామ భీమేశ్వరాలయంలో బాలాత్రిపురసుందరి అమ్మవారికి పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి సుందరరామయ్య (రాంబాబు), అళక్కి రాజగోపాలశర్మ, వెంకటరమణ, కొంతేటి భీమేశ్వరశర్మ వేద మంత్రోచ్చారణలతో విశేష పూజలు నిర్వహించారు. బాలాత్రిపురసుందరి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమివ్వగా జిల్లా నలుమూలల నుంచీ అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు దర్శించుకున్నారు. కంచి కామకోటి మహా సంస్థానంలోని స్వయంవర పార్వతి అమ్మవారికి చంద్రాభట్ల పతంజలి-పద్మ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.


పిఠాపురం పాదగయలో బాలాత్రిపుర సుందరి అలంకరణలో రాజరాజేశ్వరీదేవి

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): పాత కోరింగలోని శ్రీకురంగేశ్వర ఆలయంలో గాయత్రీ దేవికి అర్చకుడు సాయిప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులు పూజలు చేశారు. కుంకుమ పూజ, లక్ష పత్రి పూజ, అభిషేకాలు జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆమె అనుగ్రహం పొందారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): వరుసల వారి వీధిలోని భువనేశ్వరి పీఠంలో అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధిపతి చింతా గోపీశర్మ ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్దాపురం మరిడమ్మ, కాండ్రకోట నూకాలమ్మ గాయత్రీ దేవిగా భక్తులను అనుగ్రహించారు. ఈవోలు కె.విజయలక్ష్మి, ఎం.రాంబాబురెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


అఖిల్‌కుమార్, ఐశ్వర్యాంబిక

జిల్లా స్థాయి పోటీల్లో అరట్లకట్ట విద్యార్థులకు ప్రథమ స్థానం

కరప, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి డిబేట్ కాంపిటీషన్‌లో అరట్లకట్ట హైస్కూలు విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారని హెచ్ఎం పి.శ్రీనివాసకుమార్ తెలిపారు. కాకినాడ సాలిపేట గర్ల్స్ హైస్కూల్లో 'సేవ్ ద గర్ల్ చైల్డ్' కాన్సెప్ట్‌తో నిర్వహించిన పోటీలో తమ పాఠశాల పదో తరగతి విద్యార్థులు కొట్టు అఖిల్‌కుమార్, బత్తుల ఐశ్వర్యాంబిక ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. రూ.5వేల నగదు, ప్రశంసాపత్రాలను వచ్చే నెల 11న కాకినాడలో అందజేస్తారని వివరించారు. విద్యార్థులను, వారికి తర్ఫీదు ఇచ్చిన ఆంగ్ల ఉపాధ్యాయురాలు పద్మశ్రీలను హెచ్ఎం, ఎస్ఎంసీ చైర్మన్ దారా వీరబాబు అభినందించారు.



కబడ్డీ...

పరుగు పందెం...

క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ శృతిరెడ్డి

'ఆదిత్య' ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

పిఠాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మహారాజా ఫౌండేషన్, ఆదిత్య స్కూల్స్ ఆధ్వర్యంలో పిఠాపురం మహారాజా జయంత్యుత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. పిఠాపురం మహారాజు రాజా వెంకట మహీపతి సూర్యరాయ బహద్దూర్ 140 జయంతిని పురస్కరించుకుని రెండు రోజులు జరిగే అంతర పాఠశాలల క్రీడోత్సవాలను ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ ఎస్.శృతిరెడ్డి ప్రారంభించారు. శృతిరెడ్డి, విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ మహారాజా విద్య, వైద్య, ఇతర రంగాల్లో ప్రజలకు అందించిన సేవలను నేటి తరానికి తెలియజేసేందుకే ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. పలు అంశాల్లో ఆటల పోటీలు జరిగాయి. ప్రిన్సిపాల్ విజయసారథి, వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, కిండర్ వండర్ ఇన్‌చార్జి రేవతి, బ్లూమింగ్ మైండ్స్ ఇన్‌చార్జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'మహిళ ఆరోగ్యమే కుటుంబానికి బలం'

కరప, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆమె కుటుంబానికి బలమని నమ్మి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. కరప పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం జరిగిన స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో ఆయన మాట్లాడారు. పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. జనసేన నేత యాళ్ల వీర వెంకట సత్యనారాయణ శిబిరానికి విచ్చేసిన వారికి భోజన సదుపాయం ఏర్పాటుచేశారు. గొర్రిపూడిలో కూడా వైద్యాధికారులు స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ నిర్వహించారు. పదో జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా కరప చంద్రన్న సమావేశ మందిరంలో గురజనాపల్లి ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కరప ఏఎంసీ చైర్మన్ ముద్రగడ రమేష్, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు, జనసేన మండల శాఖ అధ్యక్షుడు బండారు మురళి, గొర్రిపూడి సర్పంచ్ కానూరి రమాదేవిశ్రీహరి, నీటి సంఘం అధ్యక్షుడు జోకా తాతాజీ, గండి వెంకటేశ్వరరావు, బోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, అనుకుల రాంబాబు, పుణ్యమంతుల అన్నవరం, జిల్లెల ప్రసాద్, గొర్రెల వెంకటరమణ, కోన వెంకటలక్ష్మి, పేపకాయల మణికుమార్, పేకేటి దుర్గాప్రసాద్, యాళ్ల పండు, వైద్యాధికారులు పాల్గొన్నారు.


కరప పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు

'జయలక్ష్మి సొసైటీ ప్రస్తుత బోర్డుతో బాధితులకు ఎటువంటి న్యాయం జరగలేదు'

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'జయలక్ష్మి సొసైటీ నూతన బోర్డు ఏర్పడి మూడేళ్లవుతున్నా బాధితులకు ఎటువంటి న్యాయం జరగలేదు.. బకాయిదారులకు వడ్డీ మాఫీ చేయడం, రికవరీ పూర్తిస్థాయిలో జమ చేయించుకోకుండానే తనఖా పెట్టిన ఆస్తులను నిబంధనలకు వ్యతిరేకంగా రిలీజ్ చేయడం, డైరెక్టర్ల భర్తీలో సైతం సొసైటీ చట్టానికి తూట్లు పొడుస్తూ అనేక అక్రమాలకు పాల్పడుతున్న జయలక్ష్మి సొసైటీ పాలకవర్గంపై బాధితులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.. అధికారులు వీరిపై చర్యలు తీసుకోవాలి' అని ది జయలక్ష్మి ఎంఏఎం సొసైటీ డిపాజిటర్ల బాధితుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం 49వ డివిజన్ అశోక్‌నగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘ ప్రతినిధులు అయ్యగారి రాజగోపాలరావు, ఎస్వీఎస్ సుబ్బారావు, బీవీవీ సత్యనారాయణ, కస్తూరి రవికుమార్, బదిరీ నారాయణ మాట్లాడారు. ఈ నెల 29న కాకినాడలో నిర్వహించతలపెట్టిన జయలక్ష్మి సొసైటీ సర్వసభ్య సమావేశం పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

'పని గంటల పెంపు తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలి'

పెద్దాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పని గంటలను పెంచుతూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో త హసీల్దారు వెంకటలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు గడిగట్ల సత్తిబాబు, చింతల సత్యనారాయణ, వడ్డి సత్యనారాయణ, టీఎల్ పద్మ, కాలే దేవి, లక్ష్మి, సత్య ఉమ, చంటి, గూనురు రమణ, కృష్ణ, అప్పన్న, రమేష్, మరిడియ్య, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అధ్యక్షుడిగా ఎన్నికైన మహేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ది కోకనాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా మహేష్

కాకినాడ సిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): 157 ఏళ్ల చరిత్ర గల ది కోకనాడ చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తొమ్మిది మంది డైరెక్టర్లతో పాటు ముగ్గురు సలహాదారులతో కార్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా గాదం చంద్రశేఖర్ (మహేష్), ఉపాధ్యక్షుడిగా ఏవీ రంగారావు, డైరెక్టర్లుగా ఏకే విశ్వనాథం, సి.నరసింహరావు, పీవీ రావు, ఎంఎస్ కుమార్, దంటు భాస్కరరావు, శ్రీరామ్ భగవతి, కేవీఎస్ సీతారాం, సలహాదారులుగా చాంబర్ పూర్వ అధ్యక్షుడు వీవీ రాఘవులు (బాబు), ఎం.సత్యనారాయణ, ఏవీ చలం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ఉపాధ్యక్ష, డైరెక్టర్లను సత్కరించారు.

'సాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు'

కరప, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాల మేరకు సాగునీటికి ఎక్కడా ఇబ్బంది తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నామని కరప డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పీజీ సత్యనారాయణ (బాబులు) తెలిపారు. పెనుగుదురు వద్ద కేఎంజే కెనాల్‌లో గుర్రపుడెక్క, తూటుకాడ తొలగింపు పనులను అధికారులు, నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. డీసీ పరిధిలోని అన్ని పంట, మురుగు కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క పనులను శరవేగంగా చేపట్టామన్నారు. కాగా కేఎంజే కెనాల్ ఇరు గట్లపై ఏడాది పొడవునా కూరగాయలను పండిస్తుండడంతో పూడికతీత పనులకు విఘాతం కలుగుతుందని పలువురు ఆరోపించారు. ఇరిగేషన్ డీఈ పి.ఆనంద్‌కుమార్, ఏఈ నాగభవానీ, పెనుగుదురు, కరప, గొర్రిపూడి నీటి సంఘాల అధ్యక్షులు తుమ్మలపల్లి గోవిందరాజులు, మెర్ల వీర వెంకట ప్రభాకర్, జోకా అప్పలరాజు, కూటమి నాయకులు బండారు మురళి, దేవు వెంకన్న, బోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, గండి వెంకటేశ్వరరావు, అనుకుల రాంబాబు, మీసాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


గుర్రపుడెక్క తొలగింపు పనులను పరిశీలిస్తున్న డీసీ చైర్మన్ బాబులు, నాయకులు


లోక్ కల్యాణ్ మేళాలో మాట్లాడుతున్న మెప్మా పీడీ ప్రియంవద

వ్యాపారాల అభివృద్ధికి రుణాలు

మెప్మా పీడీ ప్రియంవద

పిఠాపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారులు తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకునేందుకు రుణాలు అందజేస్తున్నట్లు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ప్రియంవద తెలిపారు. పట్టణంలోని రథాలపేట సెంటర్లో గల అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో మంగళవారం నిర్వహించిన లోక్ కల్యాణ్ మేళాలో ఆమె మాట్లాడారు. వీధి వ్యాపారస్తులకు తొలి విడతగా రూ.15వేలు రుణం ఇస్తామని, దానిని సక్రమంగా వినియోగించుకుని తిరిగి చెల్లిస్తే రెండో విడతలో రూ.25వేలు, మూడో విడతలో రూ.50వేలు అందజేస్తామన్నారు. ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2029 వరకు పొడిగించిందని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సతీష్, మెప్మా సీఎంఎం వెంకటలక్ష్మి, డీపీఎంయూ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు

లయన్స్ క్లబ్ జెమ్స్ నూతన కార్యవర్గమిదే

కాకినాడ సిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ జెమ్స్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఘనంగా జరిగింది. అధ్యక్షుడిగా దేవత నరసింహమూర్తి, కార్యదర్శిగా మద్దింశెట్టి రామారావు, కోశాధికారిగా లింగమల్లు శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. నూతన కార్యవర్గంతో డీవీఎస్ రాజు (రమేష్), సభ్యులతో ఇండక్షన్ ఆఫీసర్ లింగమల్లు కృష్ణమూర్తి ప్రమాణం చేయించారు. లయన్స్ జిల్లా గవర్నర్ వి.కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేయగా జిల్లా వీడీజీ చిట్నీడి శ్రీనివాస్, డాక్టర్ టి.లక్ష్మారెడ్డి, ఎస్.ప్రభుదాస్, వి.మణిబాబు పాల్గొన్నారు. పేద విద్యార్థి చదువు నిమిత్తం పి.అరుణ్‌కుమార్ ఆర్థిక సాయం అందించారు. లయన్స్ క్లబ్ జెమ్స్ వ్యవస్థాపకుడు పీడీజీ లింగమల్లు కృష్ణమూర్తి దంపతులను సత్కరించారు. జిల్లా గవర్నర్ రిప్రజెంటేటివ్ ఎస్వీ సర్వేశ్వరరావు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.


ఎదురెదురుగా వాహనాలు ఢీకొని ఇద్దరు యువకులు మృతి

తాళ్లరేవు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాడిమొగ పంచాయతీ పరిధి పెదవలసల వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందినట్టు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. యానాం పరిధిలోని సావిత్రినగర్‌కు చెందిన యువకులు మచ్చా సతీష్, పాలెపు కాసురాజు ద్విచక్ర వాహనాలపై పెదవలసల వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కోరింగ పోలీసులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.













బీజేపీ శ్రేణుల హర్షం

ఏలేశ్వరం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దసరా, దీపావళి కానుకగా జీఎస్టీ తగ్గించడంపై బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా కార్యవర్గసభ్యుడు గట్టిం వెంకటరమణ నేతృత్వంలో స్థానిక బాలాజీ చౌక్ సెంటర్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఏనుగు ధర్మరాజు, రెడ్డి లోవరాజు, గరికి నాగు, కారిణి సత్యనారాయణ, నూకాపతి, సత్తిబాబు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

కనకదుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే శిరీషదేవి


ఆలయం వద్ద మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు

రంపచోడవరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కనకదుర్గమ్మ వారి ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నట్టు ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీషదేవి అన్నారు. మంగళవారం దసరా మహోత్సవం సందర్భంగా విజయవాడ కనకదుర్గమ్మ వారిని రాష్ట్ర మహిళా శాసనసభ్యులు, మంత్రులు కలిసి దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ జగదీశ్వరి, శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ, తదితరులు ఉన్నారు.

పాముగండిలో పశు వైద్యశిబిరం

దేవీపట్నం, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): డీఎన్ పాలెం పంచాయతీ పరిధి పాముగండిలో పాడి పశువులకు ముందస్తు జాగ్రత్తగా మంగళవారం పశు వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు, కోళ్లకు ఆర్‌డీ టీకాలు వేశారు. అలాగే అనారోగ్యం బారిన పడిన పశువులకు చికిత్స చేశారు. కార్యక్రమంలో స్థానిక పశుసంవర్థక శాఖ ఏడీ బాబూరావు, పీసా ఉపాధ్యక్షుడు కోసులచ్చన్న దొర (అచ్చిబాబు), చవలం బాపన్నదొర, చవలం, గంగన్నదొర, కోసు నర్సన్న దొర, పారా సిబ్బంది , పశు సంవర్థక సహాయకులు పాల్గొన్నారు.

కూటూరులో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్

కూనవరం, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కూటూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ నిర్వహించారు. స్థానిక సచివాలయ పరిధిలోని గ్రామాల్లోని యుక్తవయస్సు బాలికలు, గర్భిణిలు, బాలింతలు, వృద్ధులు, గుట్టల పైనున్న కొండరెడ్ల మహిళలు హాజరయ్యారు. వైద్యులు శ్రీనివాస్ మూర్తి దొర మాజీ సర్పంచ్ సీతారామయ్య హెల్త్ అసిస్టెంట్లు రాము, అర్జున్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన

మోతుగూడెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): లోయర్ సీలేరు ఏపీ జెన్కోలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి నేరుగా వారికి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలుగునాడు విద్యుత్ కాంట్రాక్టు కార్మిక సంఘం సీలేరు కాంప్లెక్స్‌లో మంగళవారం కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళన చేశారు. ఈ సందరంగా పలువురు మాట్లాడుతూ అన్‌స్కిల్డ్‌గా గత 20 సంవత్సరాలు పైబడి పని చేస్తున్నారని, వారి విద్యార్హతలు బట్టి సెమీస్ స్కిల్డ్‌గా అప్ గ్రేడ్ చేయాలన్నారు.

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నరేష్

ఎటపాక, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అప్పుడే కుటుంబం బలంగా ఉంటుందని వైద్యాధికారిణి ప్రసన్నలక్ష్మీ, స్థానిక టీడీపీ నేత కరి నరేష్ అన్నారు. మంగళవారం గన్నవరంలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 80 మంది మహి ళలను పరీక్షించి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం భద్రమ్మ, ఏసుపాక బాబు, తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: గర్భిణులు, పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం ఇవ్వాలని సర్పంచ్ కోసు రమేష్‌బాబు అన్నారు. మంగళవారం ముసురుమిల్లి అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమానికి ఆయనతోపాటు ఎంపీటీసీ సభ్యుడు వంశీ కుంజం హాజరయ్యారు. కార్యక్రమంలో సీతపల్లి ఆలయ మాజీ చైర్మన్ బొబ్బా శేఖర్, వార్డు మెంబర్ సరస్వతి, మహిళా పోలీస్ కృష్ణవేణి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రోషిణి, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయం ముట్టడి

చింతూరు, సెప్టెబంరు 23 (ఆంధ్రజ్యోతి): చింతూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని మంగళవారం ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతృత్వంలో ముట్టడించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తుష్టి జోగారావు మాట్లాడారు. ఐదేళ్లగా డివిజన్‌లో సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్‌తో సహా ఆసుపత్రులలో సరిపడా సిబ్బందిని నియమించక పోవడంతో ఉద్యోగులు ఇక్కట్లు పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈవిషయమై పలుమార్లు కలెక్టర్, వైద్యశాఖ ఉన్నతాధికారులకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ, ఎటువంటి నియామకాలు చేపట్టక పోవడం విడ్డూరమన్నారు. దీంతో ముట్టడి చేపట్టాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా సరిపడినంత సిబ్బందిని నియమించి మెరుగైనసేవలు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. చివరిగా డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. పుల్లయ్యకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మడివి నెహ్రూ, గుజ్జా సీతమ్మ, కరక అర్జున్, డీ. శ్రీనివాస్, తాటి రామకృష్ణ, టీ. ఆదిలక్ష్మి, కే. భద్రకాళి, సీత, జయ, చంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చింతూరు డీఎల్‌డీవోగా విజయకుమార్

చింతూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చింతూరు డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిగా 2007 గ్రూప్- 1 అధికారైన ఎం విజయకుమార్‌ని ప్రభుత్వం నియమించింది. మంగళవారం విజయకుమార్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండల ఎంపీడీఓగా విధులు నిర్వర్తించారు. కాగా పదోన్నతిపై ఇక్కడకి వచ్చారు.

చింతూరు టీడీపీ మండల అధ్యక్షుడిగా జమాల్‌ఖాన్



చింతూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండల టీడీపీ అధ్యక్షుడిగా మహ్మద్ జమాల్‌ఖాన్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పార్టీ మంగళవారనం ప్రకటించింది. వాస్తవానికి జమాల్ ఎన్నిక ఏకగ్రీవమైంది. అలాగే జనరల్ సెక్రటరీగా వాసా శ్రీరామరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా తుర్రం బాబూరావు, గడ్డం సురేష్‌కుమార్ చౌదరి, మండల కార్యదర్శిగా కట్టా శంకర్‌తో కమిటీని పార్టీ ప్రకటించింది. పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పనిగంటల పెంపుపై కార్మిక సంఘాల నిరసన

వై.రామవరం, సెప్టెంబరు 23 (ఆం ధ్రజ్యోతి): ఉద్యోగుల పని వేళలను 12 గంటలకు పెంచే విధంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలోచనను వెనక్కి తీసుకోవాలని కోరుతూ మంగళవారం వై.రామవరంలో సీఐటీయూ నేత కే. శాంతిరాజు ఆధ్వర్యంలో కార్మికసంఘా ల నిరసన వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా ఎనిమిది గంటల పనివేళలను యథావిధిగా కొనసాగించాలని నినాదాలు చేశారు. వేతనాలు పెంచకుండా పనిగంటలు పెంచితే ఎలా జీవించాలని వారంతా ప్రశ్నించారు. కార్యక్రమంలో అంగన్వాడీ మండల అధ్యక్షురాలు బేబీరాణి, బులమ్మ, వెంకయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం

చింతూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చింతూరు పోలీసులు మంగళవారం గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రమేష్ కథనం మేరకు ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లాకు చెందిన ఆశీష్‌సర్కార్, హేమంత్ మండల్ వయా చింతూరు మీదుగా ద్విచక్రవాహనంపై గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. తాము ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వాహన తనఖీలు చేపట్టామన్నారు. దీంతో వారి నుంచి ఆరుకేజీల గంజాయి, ద్విచక్ర వాహనం, రెండు మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. గంజాయి విలువ రూ. 30 వేలు ఉంటుందన్నారు.

గాయత్రీ దేవి అలంకారంలో కనకదుర్గమ్మ దర్శనం


అన్నవరం, జగ్గంపేట, రౌతులపూడిలలో ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు

తొండంగి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నవరాత్రుల్లో రెండోరోజైన మంగళవారం ఏ.కొత్తపల్లి కదంబ క్షేత్రంలో భువనేశ్వరి అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని గాయత్రి అష్టోత్తర శతనామాలతో అర్చించారు. ఏవీనగరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో అమ్మవారు బాలాత్రిపురసుందరిగా భక్తులను అనుగ్రహించారు. ఉదయం, సాయంత్రం విశేష పూజలు నిర్వహించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమలరామకృష్ణుడు సతీమణి విజయలక్ష్మి పూజాకార్యక్రమాల్లోపాల్గొన్నారు. అర్చకులు చరణ్, మిశ్రా పూజలు నిర్వహించారు.

ప్రత్తిపాడు,(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు,ధర్మవరం, ఒమ్మంగి ఆలయాల్లోని కనకదుర్గ అమ్మవార్లను, రాచపల్లిలోని అరుణాచల ఆలయంలో అపీత కుచాంబ అమ్మవారిని గాయత్రిదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ధర్మవరం కాకి సూర్యారావుపేట వినాయకగుడి వద్ద దుర్గాదేవికి భక్తులు పూజలు నిర్వహించారు.

రౌతులపూడి(ఆంధ్రజ్యోతి): రౌతులపూడిలో దురాదేవి అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని నిమ్మ కాయలతో అలంకరించారు. ఆలయ ఆవరణలో కుంకుమ పూజలు నిర్వహించారు.

కిర్లంపూడి, (ఆంధ్రజ్యోతి): కిర్లంపూడిలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు జరుగుతున్నాయి. గ్రంధి నాగేశ్వరరావు సుధారాణి దంపతులు పీటలపై ఆశీనులు కాగా ఆలయ ప్రధాన అర్చకులు సోమయాజులు మురళీ సౌజన్యంతో వేదపండితులు ఆరాధ్య లక్ష్మి నరసింహమూర్తి శర్మ, వెలవలపల్లి శ్రీవర్ధన్ శర్మల బృందం ఈ వేడుకలను ప్రారంభించారు.

జగ్గంపేట,(ఆంధ్రజ్యోతి): జగ్గంపేటదేవీసెంటర్లో వెలిసిన లలితా భువనేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపురసుందరిదేవిగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారికి అలంకరణకు నాళం నూరిబాబు దంపతులు చీర, పూలహారాలను సమర్పించారు.

అన్నవరం, (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగం గా ప్రముఖ పుణ్యక్షేత్రం సత్యదేవుడి సన్నిధిలో కొలువుదీరిన వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు రెండోరోజు మంగళవారం కల్యాణగౌరీ అలంకరణలో దర్శనమిచ్చారు. దర్బారు మండపంలో సువాసిని, బాల, కౌమారిపూజలతోపాటుగా సూర్యనమస్కారములు, మహాలింగార్చన,కుంకుమపూజలు నిర్వహించారు. అమ్మవారిని అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

తుని రూరల్, (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి వేడుకలుపురస్కరించుకుని లోవ క్షేత్రంలో తలుపులమ్మ అమ్మవారు శ్రీగాయత్రి దేవి అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులచే సామూహిక కుంకుమార్చన పూజలు జరిపించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో చండీహోమాన్ని నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

దుర్గాదేవికి పల్లకీ బహూకరణ



రౌతులపూడి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవ రాత్రు లను పురస్కరిం చుకుని రౌతులపూడిలో దుర్గాదేవి అమ్మవారికి రూ.50వేలు విలువైన పల్లకీని గ్రామానికి చెందిన గోడికృష్ణ, వీరవేణి దంపతులు బహూకరించారు. కార్యక్రమంలో గోడి శ్రీకాంత్, రూప గోడి చిన్న, అంబిక, గంగరాజు, భ్రమరాంబిక పాల్గొన్నారు. రౌతులపూడిలో దుర్గాదేవి అమ్మవారిని వైసీపీ ప్రత్తిపాడు కోఆర్డినేటర్ ముద్రగిరి గిరిబాబు, వైసీపీ మహిళా నాయకు రాలు పర్వత జానకి దర్శించుకుని పూజలు చేశారు.

విష్ణు సహస్ర నామ పారాయణం

జగ్గంపేట, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): స్థానికఆర్యవైశ్య కల్యాణ మండపంలో స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా గోవింద విష్ణు సహస్రనామ పారాయణం ఘనంగా నిర్వహించారు. అలాగే 27సార్లు నక్షత్రమాల పారాయణం నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని బొండా విజయ మల్లిక, మానేపల్లి స్వాతినాగలక్ష్మి, మానేపల్లి విజయలక్ష్మి, మానేపల్లి రజిని, కొత్త ఇందిర, బొండాడ శ్రావణి, మాతంశెట్టి లావణ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) హాజరై ప్రత్యేక పూజలు చేశారు.


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళలు

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి


చింతలూరులో వైద్యం శిబిరం నిర్వహిస్తున్న శాంతి ఆశ్రమం వైద్యాధికారి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని రాచపల్లి, శాంతిఆశ్రమం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఉషాశ్రీ, మురళీమోహన్ రెడ్డి చెప్పారు. మంగళవారం ఒమ్మంగి సచివాలయం-1, చింతలూరు సచివాలయం వద్ద స్వస్థ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్‌లో వైద్య శిబి రాలు నిర్వహించారు. చింతలూరులో 72 మందికి పరీక్షచేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఒమ్మంగిలో 120 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మం దులు అందజేశారు. శిబిరాల వద్ద తల్లిపాలు, బిడ్డ ఆరోగ్య భవిష్యత్, వ్యక్తిగత పరిశుభ్రత, బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కేన్సర్ స్క్రీనింగ్స్, టీబీ నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై వైద్యాధికారులు, అంగ న్‌వాడీ సూపర్‌వైజర్ చక్రవేణి వివరించారు. ఈకార్యక్రమాల్లో సర్పంచ్ పండ్రాడ గంగారాము, టీడీపీ నాయకులు జింకల ఫకీర్, తూము కొండబాబు, పోల్నాటి భగవాన్, ఎంపీటీసీ కిషోర్, వైస్ సర్పంచ్ అల్లు అప్పలరాజు పాల్గొన్నారు.

'కృష్ణా జిల్లాకు రంగా పేరు పెట్టాలి'


సమావేశంలో మాట్లాడుతున్న బుజ్జి

తుని రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం కేంద్రంగా ఉన్న కృష్ణా జిల్లాకు దివంగత వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలని ఆంధ్రా, తెలంగాణ రాధా రంగా మిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు కాళ్లపాలెం బుజ్జి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సాయంత్రం స్థానిక బాలాజీ లాడ్జి సమీపంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఒక జిల్లాకు రంగా పేరు పెడతామని హామీ ఇచ్చిం దన్నారు. ఈవిషయమై ముఖ్యమంత్రి చంద్రబాబును కలవగా సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సూరపురెడ్డి శ్రీనివాసరావు, అద్దేపల్లి బాలాజీ, గెడ్డమూరి సురేష్, సీహెచ్ ఈశ్వర్, మొగశాల శ్రీనివాస్ కనిగిరి ప్రసాద్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఏలేశ్వరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండలాధ్యక్షుడు జ్యోతుల పెదబాబు అన్నారు. మంగళవారం లింగంపర్తి గ్రామంలో స్వస్థ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు మాణిక్య కుమారి, నాగేశ్వరరావు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. లింగంపర్తి సొసైటీ అధ్యక్షుడు పెంటకోట మోహన్, ఎంపీటీసీ వరుపుల దుర్గాదేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూర్యకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సత్కారం



ఏలేశ్వరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో రవికుమార్‌వర్మను టీడీపీ శ్రేణులు సత్కరిచారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మీదేవి, ఎంపీటీసీలు కొప్పుల బాబ్జి, పసల సూరిబాబు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. టీడీపీ నాయకులు సుంకర సత్యనారాయణ, చిక్కాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

తుమ్మలపల్లి పరామర్శ

జగ్గంపేట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మన్యంవారిపాలెం గ్రామానికి చెందిన పొట్రూ శ్రీను ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురికావడంతో జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పరామర్శించారు. మరిసే రామకృష్ణ, గండికోట శ్రీను, గవర సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే సత్యప్రభ



ప్రత్తిపాడు, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): అమరావతిలో సీఎం చంద్రబాబునాయుడును మంగళవారం రాత్రి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కలిశారు. అధ్వానంగా ఉన్న జె.అన్నవరం రహదారికి రూ.5కోట్లు మంజూరు చేయాలని కోరారు. ఈసందర్భంగా సీఎంకు వినతిపత్రం అందజేశారు. ఏలేరు నది కాల్వపై నిర్మించిన ఏలేశ్వరం అప్పనపాలెం వంతెన ధ్వంసమైందని, కొత్త వంతెన నిర్మించాలని కోరారు.


అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

జగ్గంపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ కాంటీన్ నిర్వహించారు. సుమారు 500 మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాదారపు వీరబాబు, కురుమల్ల నాగేశ్వరావు, సత్తి సోమరాజు, పాతంశెట్టి రమేష్, కర్నాకుల సూరిబాబు, గంధం శ్రీను, అంకం ఓం కృష్ణ, రామకుర్తి శ్రీమన్నారాయణ, చిరుత తాతాజీ పాల్గొన్నారు.


రాచపల్లిలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న దృశ్యం

రాచపల్లిలో పశు వైద్య శిబిరం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాచపల్లి గ్రామంలో మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా పశు వైద్యశాఖ ఉపసంచాలకులు డాక్టర్ కాంతారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 300 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. మరో 70 పశువులకు గర్భకోస వ్యాధి వ్యాధులకు చికిత్స చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అన్నవరం దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యుడు బుద్ధరాజు గోపిరాజు, ప్రత్తిపాడు సహాయ సంచాలకులు డాక్టర్ యోగేశ్వర్, పశువైద్యులు ప్రసాద్ సతీష్ సాయి కృష్ణ మంజూష, పలువురు రైతులు పాల్గొన్నారు.


శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న సిబ్బంది

పీ4 సిబ్బందికి శిక్షణ తరగతులు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో మంగళవారం విజన్ యాక్షన్ ప్లాన్ 2047లో భాగంగా పీ4 యాప్ నిర్వహణపై మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనీలు, విజన్ యాక్షన్ ప్లాన్ సిబ్బంది, మండల పరిధిలోని అన్ని పంచాయతీల కార్యదర్శులు, గ్రామ సచివాలయాల సిబ్బందికి ఒకరోజు శిక్షణ నిర్వహించారు. పీ-4 యాప్ నిర్వహణలో చేపట్టాల్సిన అంశాలను మాస్టర్ ట్రైనీలు తెలిపారు. కార్యక్రమంలో 223 మంది సిబ్బంది హాజరుకాగా ఇన్‌చార్జ్ ఎంపీడీవో కేవీవీఎస్ విశ్వనాధం పర్యవేక్షించారు.

వేంకటేశ్వర ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు

తుని రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బజారు వీధిలోని శ్రీ వేంకటేశ్వరుని ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ పాలకవర్గ చైర్మన్ కుక్కడపు బాలాజీ ఆధ్వర్యంలో టీడీపీ నేత యనమల రాజేష్, పాలక మండలి సభ్యులు, మున్సిపల్ మాజీ చైర్మన్ యినుగంటి సత్యనారాయణ తదితరులు స్వామివారికి పట్టువస్త్రాలు అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహిళల ఆరోగ్య రక్షణే లక్ష్యం

శంఖవరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళ ఆరోగ్య రక్షణే స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్ అన్నారు. మంగళవారం స్థానిక ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతంనీడి కుమార్, బొర్రా వాసు, జట్ల శ్రీను, వైద్యులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్ భవనాల ప్రారంభం ఎప్పుడో..?

ప్రత్తిపాడు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో వెల్‌నెస్ సెంటర్ భవనాలు ప్రారంభోత్సవానికి ఎదురుచూస్తున్నాయి. దాదాపుగా 90 శాతం పనులు పూర్తయి ఉన్న 7 భవనాలు మండలంలో రెండేళ్లగా నిరుపయోగంగా ఉన్నాయి. రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఒమ్మంగిలో 2, ధర్మవరంలో 3, ఏలూరులో 2, ప్రత్తిపాడులో 2 వెల్‌నెస్ సెంటర్ భవనాలు మంజూరయ్యాయి. మండలంలోని 8 సచివాలయాల పరిధిలో 8 భవనాలు నిర్మించారు. మరొక భవనం పనులు చేపట్టలేదు. నిర్మించిన భవనాలకు కొన్నిచోట్ల ఫ్లోరింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ పనులు చేపట్టడంతో పాటు కిటికీలు, తలుపులు ఏర్పాటు చేయాల్సి ఉంది. రాచపల్లి పీహెచ్‌సీలో చిన్నిపాటి పనులు మినహా పూర్తయిన 8 భవనాల్లో 7 భవనాలను సంబంధిత పీహెచ్‌సీకి అప్పగించారు. మిగిలిన 10శాతం పనుల నిర్వహణ పనుల జాప్యం వల్ల ప్రారంభం జరగలేదు. ఇదే పరిస్థితి ప్రత్తిపాడులోని హైస్కూల్ సమీపంలో వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న వెల్‌నెస్ కేంద్రం ఉంది. అధికారులు స్పందించి భవనాల పనులు పూర్తి చేసి వెంటనే ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు. రాచపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఉషశ్రీని వివరణ కోరగా వెల్‌నెస్ సెంటర్ల భవనాల్లో మిగిలిన పనుల పూర్తికి నిధులు మంజూరయ్యాయని త్వరలో వాటిని పూర్తిచేసి ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

స్థానిక ఎన్నికల్లోపే పనులు పూర్తి కావాలి

యనమల రామకృష్ణుడు

తుని రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల కోడ్ వచ్చేలోపే తునిలో జరుగుతున్న పనులు పూర్తి చేసేలా అధికారులు చొరవ తీసుకోవాలని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సూచించారు. మున్సిపల్ ఎన్నికల నగారా జనవరిలో మోగనున్నడంతో వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్న ప్రభుత్వ సంకేతాల నేపథ్యంలో తేటగుంట టీడీపీ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, టీడీపీ నాయకులతో ఆయన వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడారు. అనంతరం టీడీపీ పట్టణ నాయకులతో సమావేశమై ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో టీడీపీ తుని అధ్యక్షురాలు కుసుమంచి శోభారాణి, చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, మున్సిపల్ మాజీ చైర్మన్ యినిగంటి సత్యనారాయణ, మోతుకూరి వెంకటేష్, యనమల రాజేష్ తదితరులు ఉన్నారు.

పీ-4 పాలసీపై సమీక్షా సమావేశం


సమావేశానికి హాజరైన సిబ్బంది

గండేపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల లెవెల్ ట్రైనింగ్ ప్రోగ్రాం ఆన్ పీ-4 పాలసీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్గదర్శులు, బంగారు కుటుంబాలకు వారధిగా ఉండాలని పరిపాలనాధికారి కె.చంద్ర రావు సూచించారు. పంచాయతీ కార్యదర్శి వి.సూర్యనారాయణ మూర్తి, వెల్ఫేర్ అసిస్టెంట్ కె.ప్రసాద్ శిక్షణ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

